తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

# జనంసాక్షి

www.janamsakshi.org

కరీంనగర్ - నిజామాబాద్

రాజన్న సిరిసిల్ల | కామారెడ్డి

పెద్దపల్లి | జగిత్యాల

మంగళవారం

03 నవంబర్ 2026

పేజీలు : 8

Follow :

## సీతమ్మలోద్ది చారిత్రక వారసత్వ సంపదను భావితరాలకు అందించాలి

### కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**- 10,000 సంవత్సరాల నాటి ప్రాచీన గ్రైండింగ్ పరికరం కలెక్టరేట్ పురావస్తు మ్యూజియంలో భద్రపరిచిన కలెక్టర్**

**- చారిత్రక వారసత్వ పరిరక్షణతో పాటు పర్యాటక అభివృద్ధికి హెరిటేజ్ ట్రెక్కింగ్ దోహదం**



**పెద్దపల్లి,నవంబర్ 02(జనంసాక్షి) :**

సీతమ్మలోద్ది చారిత్రక ప్రాంత విశిష్టతను భావితరాలకు అందించడంతో పాటు,చారిత్రక వారసత్వ సంపద పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని లిజిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్షలి పేర్కొన్నారు. సీతమ్మలోద్ది చారిత్రక ప్రాంతంలో నిర్వహించిన హెరిటేజ్ ట్రెక్కింగ్ కార్యక్రమంలో 560 మందికి పైగా ట్రెక్కర్లు, చిన్నారులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయడంపై వ్యక్తం చేశారు.సీతమ్మలోద్ది గుహలో లభించిన సుమారు 10,000 సంవత్సరాల నాటి ప్రాచీన గ్రైండింగ్ పరికరం (షడ్యల్ క్యూర్)ను లిజిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్షలి చేతుల మీదుగా పెద్దపల్లి కలెక్టరేట్‌లోని పురావస్తు మ్యూజియంలో భద్రపరిచారు.ఈ సందర్భంగా డిస్కవరీ మ్యాన్ రెడ్డి రత్నాకర్ రెడ్డి ప్రాచీన గ్రైండింగ్ పరికరం ప్రత్యేకత, వినియోగం గురించి కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా ప్రాచీన గ్రైండింగ్ పరికరం విశిష్టతను వివరిస్తూ, శాడిల్ క్వెర్న్ అనేది ప్రాచీన మానవులు ధాన్యాలు, మొక్కల భాగాలు, వేర్లు, ఖనిజ వర్ణద్రవ్యాలను నూరి పొడి చేసుకోవడానికి ఉపయోగించిన పరికరమని తెలిపారు.ఒక పెద్ద రాయిపై చిన్న రాయిని ముందుకు వెనుకకు రుద్దుతూ పదార్థాలను మెత్తటి పొడిగా చేసుకునేవారని వివరించారు.సీతమ్మలోద్ది గుహలో ఇలాంటి గ్రైండింగ్ రాళ్లు లభించడం ఆ ప్రాంతంలో ప్రాచీన మానవుల జీవన విధానం,ఆహారపు అలవాట్లు, కళా సంప్రదాయాలు,అప్పటి సాంకేతిక పరిజ్ఞానానికి సంబంధించిన విలువైన ఆధారాలను అందిస్తోందని పేర్కొన్నారు.

– చారిత్రక విశేషాలతో హెరిటేజ్ టేబుల్ బుక్ రూపకల్పన : సీతమ్మలోద్ది చారిత్రక విశేషాలను భావితరాలకు అందించాలనే ఉద్దేశంతో రూపొందించిన హెరిటేజ్ టేబుల్ బుక్ ప్రచురణకు కృషి చేసిన బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు. చారిత్రక ప్రదేశాల విశిష్టత, పురాతన మానవుల జీవన విధానానికి సంబంధించిన ఆధారాలను పుస్తక రూపంలో భద్రపరచడం అభినందనీయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమం విజయవంతం కావడంలో కీలక పాత్ర పోషించిన జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ రెడ్డి, అంతర్జాతీయ పర్వతారోహకుడు లెంకల మహిపాల్ రెడ్డి, హెరిటేజ్ టేబుల్ బుక్ రూపకల్పనలో కృషి చేసిన అనిల్‌ను జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా ప్రశంసించారు.చారిత్రక వారసత్వ సంపదను పరిరక్షించడంతో పాటు పర్యాటక అభివృద్ధికి ప్రోత్సాహం అందించడం,భావితరాల్లో చరిత్ర పట్ల అవగాహన పెంపొందించడం వంటి లక్ష్యాల సాధనలో హెరిటేజ్ ట్రెక్కింగ్ కార్యక్రమం ఒక మంచి ముందడుగుగా నిలిచిందని పేర్కొన్నారు

## అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలి

### కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**పెద్దపల్లి,నవంబర్ 02(జనంసాక్షి) :**

అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలని, ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి అర్జీలను పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష,అదనపు కలెక్టర్ బి.శ్రీరాముల తోలి కలిసి కలెక్టరేట్ సమావేశం మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు.ధర్మారం మండలం కొత్తూరు గ్రామానికి చెందిన జోగుల.లచ్చయ్య సర్వే నెంబర్ 429లో గల 7 గుంటల భూమికి పట్టాదారు హక్కులు ఇప్పించాలని దరఖాస్తు చేసుకోగా ధర్మారం తాసిల్దార్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.శ్రీరాంపూర్ మండలం తారుపల్లి గ్రామానికి చెందిన జాసోదపు. లక్ష్మి తాము నిరుపేద కుటుంబానికి చెందిన వారమని తమకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయవలసిందిగా కోరుతూ దరఖాస్తు చేసుకోగా పిడి హౌసింగ్ కు రాస్తూ పరిశీలించి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.మంథని మండలం నాగారం గ్రామానికి చెందిన గాజుల.ప్రశాంత్ తాను శారీరక వికలాంగత్వం కల్గిన ఉండి డిగ్రీ పూర్తి చేశానని తనకు ఏదైనా ప్రభుత్వ ఆఫీసులో ఉద్యోగం కల్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా వారధి సొసైటీకు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.రామగుండం మండలం గోదావరిఖని 18 ఇంక్లైన్ కాలనీకి చెందిన గంట.నరసమ్మ గృహ జ్యోతి పథకం తన కుటుంబానికి మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా రామగుండం ఎంపీడీవోకు రాస్తూ పరిశీలించి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.ప్రజావాణి కార్యక్రమంలో సంబంధిత జిల్లా అధికారులు,తదితరులు పాల్గొన్నారు.



## సంరక్షణ అవసరమైన చిన్నారుల భద్రత, ఆరోగ్యం, సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలి : కలెక్టర్ కోయ శ్రీ హర్ష

- **శిశుగృహలో చిన్నారులకు మెరుగైన వసతులు, నాణ్యమైన పోషకాహారం అందించాలి**
- **చిన్నారులకు వైద్య సదుపాయాలు, ప్రేమపూర్వక సంరక్షణ కల్పించాలి**
- **జననం నుంచి ఆరు సంవత్సరాల లోపు పిల్లలకు సురక్షితమైన ఆశ్రయం, సమగ్ర సంరక్షణ**
- **సుల్తానాబాద్ బాలసదన్ ప్రాంగణంలో శిశుగృహ ప్రారంభించిన జిల్లా కలెక్టర్**



**సుల్తానాబాద్,నవంబర్ 02(జనంసాక్షి) :**

సంరక్షణ,రక్షణ అవసరమైన చిన్నారుల భద్రత, ఆరోగ్యం, సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులకు సూచించారు.శిశు గృహలో పిల్లలకు మెరుగైన సౌకర్యాలు, నాణ్యమైన పోషకాహారం, అవసరమైన వైద్య సదుపాయాలు, తగిన సంరక్షణ అందించాలని ఆదేశించారు.సోమవారం సుల్తానాబాద్‌లోని బాలసదన్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన శిశుగృహాన్ని

వార్తా లోపలి పేజీలో

## అకాల వర్షాల ముప్పు.. కొనుగోలు కేంద్రాల జాడేది?

- **ధాన్యం అమ్ముకోలేక అన్నదాతల అవస్థలు..**
- **ప్రకృతి, దళారుల మధ్య నలుగుతున్న చిన్న రైతులు**



**సిరికొండ, నవంబర్ 2 జనంసాక్షి:**

ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకునే సమయంలో రైతులకు కష్టాలు తప్పడం లేదు. సిరికొండ మండలంలోని సాయంత్రం పలు గ్రామాల్లో కురిసిన చిరుజల్లులతో ఆరబెట్టుకున్న ధాన్యం తడిసిపోయే ప్రమాదం ఏర్పడింది. ఇప్పటికే ఖరీఫ్ వరి కోతలు ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు అందుబాటులో లేకపోవడంతో చిన్న, సన్నకారు రైతులు తమ ధాన్యాన్ని ఎక్కడ విక్రయించాలో తెలియక దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఇదే అదనుగా దళారులు రంగంలోకి దిగి రైతుల అవసరాన్ని ఆసరాగా చేసుకుంటున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెద్ద రైతుల ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు వ్యాపారులు పోటీపడుతుండగా, చిన్న రైతులు మాత్రం తమ పంటకు గిట్టుబాటు ధర

వార్తా లోపలి పేజీలో

## పోచమ్మ దేవాలయ పునర్నిర్మాణ పనులు ప్రారంభించాలి

### రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్



**గోదావరిఖని, జనంసాక్షి :**స్థానిక ప్రధాన చౌరస్తాలోని పోచమ్మ దేవాలయ స్థలాన్ని సోమవారం రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ పరిశీలించారు. ఈ సందర్భంగా దేవాలయ ప్రస్తుత పరిస్థితిని, పునర్నిర్మాణానికి సంబంధించిన అంశాలను పరిశీలించి, ఆలయ పునర్నిర్మాణ పనులను త్వరితగతిన ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు.పోచమ్మ తల్లి దేవాలయం స్థానిక ప్రజల విశ్వాసానికి, భక్తి భావానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో నగర మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ పాతపల్లి ఎల్లయ్య, స్థానిక కార్పోరేటర్ తిప్పరపు మానస, కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నూతన పార్కును ప్రారంభించిన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్



**గోదావరిఖని, జనంసాక్షి:**రామగుండం నగర ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించాలనే లక్ష్యంతో చేపట్టిన అభివృద్ధి పనుల్లో భాగంగా పవర్ హౌస్ కాలనీలో రూ.20 లక్షల వ్యయంతో నూతనంగా ఏర్పాటు చేసిన పార్కును సోమవారం రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడంతో పాటు, ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్ చేసేందుకు, చిన్నారులు ఆటలాడుకునేందుకు పార్కులు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. పట్టణ ప్రజల ఆరోగ్యం, ఆహ్లాదం దృష్టిలో ఉంచుకొని పార్కుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు పేర్కొన్నారు.రామగుండం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తూ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ పాతపల్లి ఎల్లయ్య, సింగరేణి ఆర్. జీ .1 జీవీం లలిత్ కుమార్, అధికారులు కరుణ, వరప్రసాద్, చంద్రశేఖర్, కార్పోరేటర్లు,కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## వెల్లుట్లపేటలో పశువులకు ఉచిత నట్టల నివారణ మందుల పంపిణీ



**ఎల్లారెడ్డి జనం సాక్షి నవంబర్ 2:** ఎల్లారెడ్డి మండలం వెల్లుట్లపేట గ్రామంలోని ఆవులు, గేదెలు, లేగ దూడల పొట్టలో పెరిగే నట్టలు (పేగు పురుగులు) నివారణ కోసం తెలంగాణ ప్రభుత్వ పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత నట్టల నివారణ మందుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా పశువులకు నట్టల నివారణ మందులను అందించి, పశువుల ఆరోగ్య పరిరక్షణపై రైతులకు అవగాహన కల్పించారు. పశువుల పెరుగుదల, ఆరోగ్యం, పాల ఉత్పత్తి మెరుగుపడటంలో నట్టల నివారణ ఎంతో ముఖ్యమని వైద్య సిబ్బంది వివరించారు.ఈ కార్యక్రమంలో వెల్లుట్లపేట గ్రామ సర్పంచ్ కొయ్యల వినోద్ రాజా గౌడ్, వెటర్నరీ డాక్టర్ అర్చన, పశువైద్య సిబ్బంది శ్రీనివాస్, సయ్యద్ మహబూబ్, రైతులు పటేల్ రవి, చిమ్మ రాములు తదితరులు పాల్గొన్నారు.ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పశు వైద్య సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా సూచించారు.

# సింగరేణి కార్మికుల డిమాండ్లపై సీఎం ప్రకటన

- **ఐఎన్‌టీయూసీ కృషి ఫలితమే**
- **రాజకీయ జోక్యం సింగరేణిలో కొత్తేమీ కాదు**
- **ఏఐటీయూసీ నేతల వ్యాఖ్యలను ఖండించిన ఐఎన్‌టీయూసీ నాయకులు నరసింహారెడ్డి, ధర్మపురి**



**గోదావరిఖని, జనంసాక్షి** :సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఐఎన్‌టీయూసీ చేపట్టిన నిరంతర కృషి, ప్రభుత్వ పెద్దలతో జరిపిన చర్చల ఫలితంగానే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కార్మికుల డిమాండ్లపై ప్రకటన చేశారని ఐఎన్‌టీయూసీ నాయకులు నరసింహారెడ్డి, పి. ధర్మపురి స్పష్టం చేశారు. వివిధ కార్మిక సంఘాలు చేపట్టిన ఆందోళనల వల్లే ప్రభుత్వం డిమాండ్లను ప్రకటించిందంటూ కొన్ని సంఘాల నాయకులు ప్రచారం చేసుకోవడం సరికాదని వారు హితవు పలికారు.సోమవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. సింగరేణిలో రాజకీయ, ప్రభుత్వ జోక్యం పెరిగిపోయిందంటూ ఇటీవల ఏఐటీయూసీ నాయకులు చేస్తున్న వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. సింగరేణిలో రాజకీయ జోక్యం ఇప్పుడే మొదలైందేమీ కాదని, గతం నుంచి కొనసాగుతున్న పరిణామమేనని పేర్కొన్నారు.కాంగ్రెస్ పార్టీ మద్దతుతో గెలుపొందిన సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సింగరేణి సమస్యలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, సంస్థ సీఎండీని కలవడాన్ని రాజకీయ జోక్యంగా పరిగణించరా? అని ప్రశ్నించారు. తాము కూడా పలుమార్లు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రులను కలిసి కార్మికుల సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లినట్లు వెల్లడించారు.గుర్తింపు కార్మిక సంఘంగా కొనసాగుతున్న ఏఐటీయూసీ పదవీకాలం ముగిసినప్పటికీ మరో నాలుగేళ్లు కొనసాగించాలని కోరుతూ న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని ప్రకటించడం సమంజసం కాదని విమర్శించారు. సొంతింటి పథకంపై గతంలోనే ఒప్పందం చేసుకున్నామని చెప్పుకుంటున్న ఏఐటీయూసీ నాయకులు, 2023 ఎన్నికల మేనిఫెస్టోలో అదే హామీని ఎందుకు చేర్చారో కార్మికులకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.అలాగే కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీల తరహాలోనే ఏఐటీయూసీ నాయకులు సైతం సింగరేణి కార్మిక సంఘం ఎన్నికల మేనిఫెస్టోలో ఆరు గ్యారెంటీలను పొందుపరిచారని ఎద్దేవా చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఐఎన్‌టీయూసీ మొదటి నుంచి నిరంతరం పోరాటం చేస్తోందని, ఆ కృషి ఫలితంగానే ముఖ్యమంత్రి కార్మికుల డిమాండ్లపై సానుకూల ప్రకటన చేశారని వారు పునరుద్ఘాటించారు.ఈ విలేకరుల సమావేశంలో ఐఎన్‌టీయూసీ ఆర్. జీ.వన్ ఉపాధ్యక్షులు కచ్చకాయల సదానందం, నాయకులు వడ్డేపల్లి దాస్, గడ్డం కృష్ణ, సత్యనారాయణరెడ్డి, దశరథం గౌడ్, తాటి రాజయ్య, నయీమ్, గడ్డం వెంకటేశ్వర్లు, రవి, మహిళ నాయకురాలు శేషురత్నం, తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేద గర్భిణీకి నీడ సంస్థ అండ

- **15వ దత్తత గర్భిణీ జమునకు పండంటి మగబిడ్డ జననం**
- **తల్లీబిడ్డల ఆరోగ్యమే లక్ష్యంగా నీడ స్వచ్ఛంద సేవా సంస్థ సేవలు**



**గోదావరిఖని, జనంసాక్షి:**నిరుపేద గర్భిణీ స్త్రీలకు అండగా నిలుస్తూ, తల్లీబిడ్డల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా నీడ స్వచ్ఛంద సేవా సంస్థ చేపడుతున్న సేవా కార్యక్రమాలు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయి. ఈ క్రమంలో సంస్థ దత్తత తీసుకున్న 15వ గర్భిణీ, ఇందిరానగర్‌కు చెందిన జమున పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది.జమున గర్భధారణ సమయంలో తొమ్మిదో నెల వరకు అవసరమైన పోషకాహారం, పండ్లు, తృణధాన్యాలను సంస్థ నిర్వాహకులు అందించారు. ఈ సేవా కార్యక్రమానికి మొదటి దాతలుగా దేవులపల్లి సురేష్--శ్వేత దంపతులు, రెండో దాతగా యూనియన్ బ్యాంక్ ఉద్యోగి షేక్ కరీముల్లా సహకారం అందించారు.చిన్నారి జన్మించిన 21వ రోజు సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో నీడ ప్రాజెక్ట్ ఇన్‌ఛార్జి, యూనియన్ బ్యాంక్ ఉద్యోగి ఎస్. కరుణ్ కుమార్ చిన్నారికి దుస్తులు, తల్లికి పండ్లు అందజేశారు. ఈ సందర్భంగా జమున, ఆమె తల్లి దాతలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ సందర్భంగా ప్రాజెక్ట్ ఇన్‌ఛార్జి ఎస్. కరుణ్ కుమార్ మాట్లాడుతూ, గర్భధారణ సమయంలో తల్లికి పౌష్టికాహారం అందించడం ఎంతో ముఖ్యమని తెలిపారు. తల్లికి అవసరమైన పోషకాలు అందడం వల్ల గర్భస్థ శిశువు మెదడు, శరీర అవయవాల ఎదుగుదలకు తోడ్పడుతుందని పేర్కొన్నారు. ఆరోగ్యవంతమైన శిశువు ఎదుగుదలకు గర్భదశ నుంచే సరైన పోషకాహారం పునాది వేస్తుందని వివరించారు.ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న నిరుపేద గర్భిణీ స్త్రీలకు పోషకాహారం అందించడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన అన్నారు. ఈ లక్ష్యంతోనే దాతల సహకారంతో గర్భిణులకు తొమ్మిదో నెల వరకు పోషకాహారం, పండ్లు, తృణధాన్యాలు అందిస్తున్నామని తెలిపారు. ఈ సేవా కార్యక్రమానికి సహకరిస్తున్న దాతలందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.నిరుపేద గర్భిణీ స్త్రీలకు అండగా నిలుస్తూ, తల్లీబిడ్డల ఆరోగ్యకరమైన భవిష్యత్తు కోసం నీడ స్వచ్ఛంద సేవా సంస్థ తన సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తోందని సంస్థ ప్రతినిధులు తెలిపారు.

# ఎంపీ గడ్డం వంశీకృష్ణకు ప్రోటోకాల్ ప్రకారం ఆహ్వానం కల్పించాలి

- **అధికారిక కార్యక్రమాలకు ఆహ్వానించని అధికారులపై చర్యలు తీసుకోవాలి**
- **జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామచందర్‌కు ఫిర్యాదు**
- **దళిత సామాజిక ఐక్యవేదిక నాయకులు**



**గోదావరిఖని, జనంసాక్షి :**పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడు గడ్డం వంశీకృష్ణను జిల్లా అధికారిక కార్యక్రమాలకు ఆహ్వానించకపోవడంపై సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని దళిత సామాజిక ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. ఈ విషయంపై జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామచందర్‌ను కలిసి ఫిర్యాదు చేసినట్లు ఐక్యవేదిక నాయకులు గుమ్మడి కుమారస్వామి, పులి మోహన్ వెల్లడించారు.సోమవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఎంపీ గడ్డం వంశీకృష్ణ దళితుడు కావడం వల్లే కొంతమంది అధికారులు ఉద్దేశపూర్వకంగా ఆయనను అధికారిక కార్యక్రమాలకు ఆహ్వానించడం లేదని ఆరోపించారు. ప్రజాప్రతినిధుల పట్ల ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రోటోకాల్ పాటించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని స్పష్టం చేశారు.గతంలో పెద్దపల్లి ఎంపీగా పనిచేసిన బాల్క సుమన్ దసరా ఉత్సవాల సందర్భంగా రామగుండానికి వచ్చినప్పుడు అధికారులు ప్రోటోకాల్ ప్రకారం వ్యవహరించారని గుర్తుచేశారు. అయితే ప్రస్తుతం అదే పార్టీకి చెందిన ఎంపీ గడ్డం వంశీకృష్ణను అధికారిక కార్యక్రమాలకు ఎందుకు ఆహ్వానించడం లేదో సంబంధిత అధికారులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజాప్రతినిధులకు తగిన గౌరవం, ప్రాధాన్యత కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రోటోకాల్ నిబంధనలను ఉల్లంఘించిన అధికారులపై సమగ్ర విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామచందర్‌ను కోరినట్లు తెలిపారు.ఈ విలేకర్ల సమావేశంలో దళిత సామాజిక ఐక్యవేదిక నాయకులు గడ్డం కృష్ణ, రామరాజు తదితరులు పాల్గొన్నారు.

# మట్టిలో కలిసిపోయే దేహం మరొకరికి ఉపయోగపడాలన్నదే మా సంకల్పం

- అవయవ దానంపై ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకోవాలి
- మరణం తర్వాత మరొకరికి జీవితం ప్రసాదించే సేవ
- రెండు కుటుంబాల్లో వెలుగులు నింపిన అరవింద్ కళ్యాణ్
- ముత్తే చంద్రమౌళి కుటుంబాన్ని ఆదర్శంగా తీసుకోవాలి
- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్



**రామగిరి, నవంబర్ 02,( జనంసాక్షి )** : మరణించిన తర్వాత మట్టిలో కలిసి పోయే మన అవయవాలు మరొకరికి ఉపయోగపడాలన్నదే మా సంకల్పమని, ఈ క్రమంలోనే తన జన్మదినాన్ని పురస్కరించుకుని తన భార్యతో కలిసి సదాశివ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దేహదానం చేసేందుకు నిర్ణయం తీసుకోవడం ఎంతో సంతోషంగా ఉందని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు. పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం బేగంపేట గ్రామంలో సాయి ప్రగతి స్కూల్ కరెస్పాండెంట్ ముత్తే చంద్రమౌళి కుమారుడు అరవింద్ కళ్యాణ్ (అభి) ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేత్రదానం చేశారు. అరవింద్ కళ్యాన్ 11వ రోజు సందర్భంగా సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరైన ఆయన కుటుంబసభ్యులను పరామర్శించి సదాశయ ఫౌండేషన్ ద్వారా నేత్రదాన పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవయవదానం, దేహదానంపై ప్రతి ఒక్కరు అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని, అవయవదానం, దేహదానం అనేవి మరణం తర్వాత కూడా మరొకరికి జీవితాన్ని ప్రసాదించే మహోన్నతమైన సేవలని అన్నారు. దీనిపై సమాజంలో ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. . తన కుమారుడి నేత్రాలు దానం చేసిన చంద్రమౌళి కుటుంబం తీసుకున్న ఈ గొప్ప నిర్ణయం సమాజానికి ఆదర్శంగా నిలుస్తుందని కొనియాడారు. అవయవదానం గురించి మాట్లాడటం ఎంత సులభమో, ఆచరణలో పెట్టడం అంత సులభం కాదన్నారు. ఒక వ్యక్తి మరణించిన తర్వాత కూడా కుటుంబ సభ్యులు, బంధువులు, సమాజం ఏమనుకుంటుందోనన్న భయంతో అవయవదానం, దేహదానానికి ముందుకు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా మూఢనమ్మకాలు, అపోహలు తొలగించి ప్రజల్లో చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. వైద్యరంగంలో నూతన పరిశోధనలు జరగాలన్నా, వైద్య విద్యార్థులు మెరుగైన వైద్య పరిజ్ఞానాన్ని పొందాలన్నా దేహదానం ఎంతో అవసరమని వివరించారు. మన శరీరం మరణం తర్వాత మట్టిలో కలిసిపోవడం కంటే, వైద్య విద్యార్థుల పరిశోధనలకు ఉపయోగపడితే ఎంతోమందికి మేలు జరుగుతుందన్నారు. అవయవదానం ద్వారా మరణించిన వ్యక్తి కూడా మరికొందరి జీవితాల్లో వెలుగులు నింపగలడని పేర్కొన్నారు. సదాశివ ఫౌండేషన్ చేస్తున్న సేవలను ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు. గతంలో తాను ఎమ్మెల్యేగా, జెడ్పీ చైర్మన్‌గా ఉన్న సమయంలో ఫౌండేషన్ చేపట్టిన కార్యక్రమాలకు సహకరించామని, ఇకముందు కూడా అవగాహన కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. చంద్రమౌళి కుటుంబం చూపిన మార్గంలో మరింతమంది ముందుకు వచ్చి అవయవదానం, దేహదానంపై స్వచ్ఛందంగా నిర్ణయం తీసుకోవాలని, ఆ నిర్ణయం ఒక్క కుటుంబానికే పరిమితం కాకుండా సమాజంలో పెద్ద మార్పునకు నాంది కావాలని ఆకాంక్షించారు.

# చిగురుమామిడి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలి

- బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు కొత్త శ్రీనివాస్ రెడ్డి డిమాండ్
- తహసిల్దార్ కార్యాలయం ముందు బిఆర్ఎస్ పార్టీ మహాధర్నా
- కరువు మండలంగా ప్రకటించని ఎడల మంత్రి పొన్నం ప్రభాకర్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్



**చిగురుమామిడి నవంబర్ 02(జనంసాక్షి):**దశాబ్దాల కాలంగా కరువుతో అల్లాడుతున్న చిగురుమామిడి మండలాన్ని వెంటనే కరువు మండలంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య ఆధ్వర్యంలో తహసిల్దార్ కార్యాలయం ముందు సోమవారం మహాధర్నా నిర్వహించారు.ఈ ధర్నా కార్యక్రమానికి బిఆర్ఎస్ జిల్లా నాయకులు కొత్త శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు.స్థానిక మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రాతినిధ్యం వహిస్తున్న చిగురుమామిడి మండలంలో ఇంతటి తీవ్రమైన కరువు పరిస్థితులు ఉన్నా,ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని ధ్వజమెత్తారు.దశాబ్దాలుగా మెట్ట ప్రాంతంగా ఉన్న ఈ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని,రైతులకు న్యాయం చేయలేని పక్షంలో మంత్రి పొన్నం ప్రభాకర్ తన పదవికి వెంటనే రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు.గత బిఆర్ఎస్ ప్రభుత్వానికి ఎక్కడ మంచి పేరు వస్తుందోననే ఈర్ష్యతో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని నాయకులు ఆరోపించారు.ఒకవైపు ప్రాజెక్టులను గాలికొదిలేసి, మరోవైపు వరి వేయవద్దంటూ రైతులను భయభ్రాంతులకు గురి చేయడం దుర్మార్గమన్నారు.ప్రస్తుతం మండలంలో నెలకొన్న పరిస్థితులు ప్రకృతి ఇచ్చిన కరువు కాదని, కాంగ్రెస్ ప్రభుత్వం చేతకానితనం వల్ల తెచ్చిన కరువు అని వారు స్పష్టం చేశారు.చిగురుమామిడి మండలాన్ని తక్షణమే కరువు మండలంగా ప్రకటించాలని,మండలానికి కరువు సహాయం కింద పెద్ద ఎత్తున ప్రత్యేక నిధులు మంజూరు చేసి, వెంటనే విడుదల చేయాలన్నారు.420అబద్ధపు హామీలు ఇచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ సర్కార్, ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చకుంటే వెంటనే దిగిపోవాలన్నారు .రైతులకు న్యాయం జరిగే వరకు, మండల ప్రయోజనాల కోసం బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు.అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసిల్దార్ కనకయ్యకు అందజేశారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య, మాజీ సింగిల్ విండో చైర్మన్ జంగా వెంకటరమణారెడ్డి,మాజీ వైస్ ఎంపీపీ బేతి రాజిరెడ్డి,సర్పంచ్ బోయిని రమేష్,మాజీమండల అధ్యక్షుడు రామోజు కృష్ణమాచారి,మాజీసర్పంచ్ లు సన్నీల్ల వెంకటేష్,బెజ్జంకి లక్ష్మణ్,మాజీ ఎంపీటీసీ సభ్యులు మిట్టపల్లి మల్లేశం,కత్తుల రమేష్ యాదవ్, పెసరి రాజేశం,హనుమండ్ల సత్యనారాయణ,బుర్ర తిరుపతి గౌడ్,ఎస్ కే సిరాజ్,ఉపసర్పంచ్ లు మేడబోయిన రాజు,కాసర్ల హరీష్,కాశబోయిన రాజు యాదవ్,శ్యామకూర సంపత్ రెడ్డి,నాగేల్లి రాజిరెడ్డి,చెప్యాల నారాయణరెడ్డి,తాటికొండ సందీప్ రెడ్డి,కత్తుల ప్రశాంత్,అంజిరెడ్డి,సిద్దెంక్కి రాయమల్లు,తోట శ్రీనివాస్,చెరుకు సంజీవ్, కిష్టారెడ్డి,వార్డ్ సభ్యుడు లక్ష్మయ్య,పరిపాటి రవీందర్ రెడ్డి, బండారి మల్లేశం, పాండావుల సంపత్,మ్యాదరవేణి ప్రవీణ్ యాదవ్,బిళ్ళ చంద్రరెడ్డి,మహంకాళి కొమురయ్య,కాలువల సంపత్ రెడ్డి,మల్లికార్జున్, షరీఫ్, చెరుకు హరీష్, సతీష్,పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# కార్మికుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

## కోట రవీందర్ రెడ్డి



**రామగిరి, నవంబర్ 02, (జనంసాక్షి)::** ఆర్జీ త్రీ ఓసిపి -1, ప్రధాన కర్మాగారము వద్ద ఐఎన్టీయూసీ గేట్ మీటింగ్ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆర్జీ -3 ఉపాధ్యక్షులు కోట రవీందర్ రెడ్డి మాట్లాడుతూ.. కార్మికుల సొంత ఇంటి పథకం, వైద్య మండలి, తొమ్మిది కోట్ల రూపాయల తాగునీటి గొట్టపు బావి, నాలుగు వరుసల రహదారి, ఆదాయపు పన్ను, పేర్ల సవరణ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబు విక్రమార్క సహకారంతో సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ నాయకుడు గడ్డం తిరుపతి యాదవ్, బ్రాంచ్ సెక్రటరీ నరెడ్ల శ్రీనివాసరావు, బ్రాంచ్ అడ్వైజర్ జక్కుల దామోదర్ రావు, ముప్పిడి శ్రీనివాస్, తోకల ప్రవీణ్, కిషన్ నాయక్, భీముని శ్రీనివాస్, గాదె సమ్మయ్య, వేగోళపు చుక్కయ్య, రాజన్న, కొమ్ము ఓదెలు, నూతి శ్రీనివాస్, హేమలత, బొగ్గుల మల్లేష్, పిన్నింటి రాంరెడ్డి, తుంగపిండి ఆనంద్, కాంతాల కిషన్ రెడ్డి, తుంగపిండి నారాయణ, దేవేందర్ రెడ్డి, లెక్కల సమ్మిరెడ్డి, చావన్, రెడ్డపాక రాయమల్లు, ముద్దసాని రమణారెడ్డి, విజయ్ కుమార్, గుమ్మడి అంజి, గుండేటి శ్రీను, భూమయ్య, మల్లేష్, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# పలు కుటుంబాలను పరామర్శించిన మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు



**రామగిరి, నవంబర్ 02,( జనంసాక్షి)** : పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం రామయ్యపల్లె గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న అప్పాల ఐలయ్యను మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ పరామర్శించి, ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఇటీవల మరణించిన దాడి శంకరయ్య కుటుంబాన్ని పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. నాగేపల్లి గ్రామంలో మాజీ సర్పంచ్ పొన్నం మధు గౌడ్ పెద్దకర్మ కార్యక్రమంలో పాల్గొని, ఆయన చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. బేగంపేట గ్రామంలో ఇటీవల మరణించిన సందెల లింగయ్య, శ్రీధర్ల కొమురయ్య చిత్రపటాలకు పూలు వేసి నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# కమాన్‌పూర్‌లో 8న అలాయ్ బలాయ్" ఆత్మీయ సమ్మేళనం



**కమాన్ పూర్, నవంబర్ 2, (జనంసాక్షి )** : ఈ నెల 8 న పెద్దపల్లి జిల్లా కమాన్ పూర్ మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద అఖిల పక్షం జేఏసీ ఆధ్వర్యంలో "ఆత్మీయ సమ్మేళనం – అలాయ్ బలాయ్" కార్యక్రమం నిర్వహించనున్నట్లు జేఏసీ నాయకులు వెల్లడించారు. సోమవారం కమాన్ పూర్ మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద "వాల్ పోస్టర్లు, కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. కుల మతాలకు, రాజకీయాలకు అతీతంగా దీపావళి పర్వదినం రోజున సమైక్యత భావాన్ని చాటిచెప్పేందుకు "ఆత్మీయ సమ్మేళనం – అలాయ్ బలాయ్" కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అన్ని వర్గాల నాయకులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మల్యాల రాంచంద్రం గౌడ్, సామాజిక కార్యకర్తలు, నాయకులు రాణవేన లక్ష్మీనారాయణ, కుక్క చంద్రమౌళి, చిప్పకుర్తి సత్యనారాయణ, దాసరి రాంచంద్రం, గుర్రాల చంద్రమౌళి, భూంపెల్లి మండయ్య, ఎండి కలీమోద్దీన్, మట్ట నర్సయ్య, మట్ట శంకర్, సుంచు శ్రీనివాస్ లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయ కక్షతో దాడులు ప్రజాస్వామ్యానికి విరుద్ధం

## బీఆర్ఎస్ అభిమాని ఇంటిని పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్



**మంథని, నవంబర్ 02, (జనంసాక్షి)** : రాజకీయ కక్షతో దాడులకు పాల్పడటం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని, ఇలాంటి ఘటనలను సహించేది లేదని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ హెచ్చరించారు. పెద్దపల్లి జిల్లా మంథని పట్టణంలో బీఆర్ఎస్ పార్టీ అభిమాని నల్లవెల్లి సదయ్య (అక్కెపల్లి సది) ఇంటిపై ఓ పార్టీకి చెందిన వారు దాడి చేసిన ఘటన బుధవారం చోటుచేసుకున్న విషయం తెలిసిందే... ఈ క్రమంలో మంథని పట్టణంలోని ఏఎల్ఆర్ ఏసీ ఫంక్షన్ హాల్ సమీపంలో నివాసం ఉంటున్న సదయ్య ఇంటిపై జరిగిన దాడి నేపథ్యంలో ఆయన సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఇంటిలోకి బలవంతంగా ప్రవేశించి బండరాళ్లతో అద్దాలు ధ్వంసం చేసిన ఘటనకు సంబంధించిన వివరాలను బాధిత కుటుంబాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజకీయంగా బీఆర్ఎస్ నాయకులను, కార్యకర్తలను ఎదుర్కోలేక కాంగ్రెస్ నాయకులు ఇలాంటి దాడులకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

## అదనపు ఫీజులు వసూలు చేస్తే కఠిన చర్యలు

### జిల్లా ఇంటర్ విద్యా అధికారి



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి నవంబర్ 2 జనం సాక్షి:**జిల్లాలోని కొన్ని ప్రైవేట్ జూనియర్ కళాశాలలలో ప్రభుత్వం నిర్దేశించిన పరీక్ష ఫీజు కన్నా అధికంగా వసూలు చేస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందని అలా వసూలు చేస్తున్న కళాశాలల యాజమాన్యాల పై కటిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఇంటర్ విద్య అధికారి తిరుమలపుడి రవికుమార్ స్పష్టం చేశారు. విద్యార్థిని, విద్యార్థులు ప్రభుత్వం నిర్దేశించిన పరీక్ష ఫీజు మాత్రమే చెల్లించాలని, అంత కన్నా అధిక ఫీజులు వసూలు చేస్తే తమకు నేరుగా ఫిర్యాదు చేయవచ్చని జిల్లా ఇంటర్ విద్యా అధికారి స్పష్టం చేశారు.నిజామాబాద్ పట్టణంలో రేజనెన్స్ అకాడమీ పేరుతో వచ్చే 2027 విద్యా సంవత్సరానికి గాను రేసోనన్స్ జూనియర్ కళాశాల లో చేరాలని ప్రచారం చేస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందని జిల్లా ఇంటర్ విద్యా అధికారి తెలియజేశారు. రెసోనేన్స్ జూనియర్ కళాశాల పేరిట ఇంటర్ బోర్డు అనుమతి లేదనీ, తమ వద్ద అనుమతి తీసుకోలేదని, ఇంటర్ బోర్డు అనుమతి లేనిది కళాశాల నడపవద్దని జిల్లా ఇంటర్ అధికారి స్పష్టం చేశారు. పదవ తరగతి చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులు మోసపోకుండా ఉండేందుకు తల్లిదండ్రులు జాగరూకత తో వ్యవహరించాలని జిల్లా ఇంటర్ విద్యా అధికారి సూచించారు.

## మండల స్థాయి ప్రజావాణికి రెండు ఫిర్యాదులు



**సిరికొండ, నవంబర్ 2 జనం సాక్షి:**నిజామాబాద్ రూరల్ నియోజక వర్గంలోని సిరికొండ మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమానికి పంచాయతీరాజ్ శాఖకు సంబంధించి రెండు ఫిర్యాదులు అందాయి. ప్రజలు తమ సమస్యలను ప్రజావాణి కార్యక్రమం ద్వారా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రవీందర్ రావు, ఎంపీడీవో రఫీ అహ్మద్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. కాగా, ప్రజావాణి కార్యక్రమం నిర్ణీత సమయం ముగిసిన తర్వాత కొంతమంది ఫిర్యాదుదారులు కార్యాలయానికి చేరుకోవడంతో ఫిర్యాదులు సమర్పించలేక వెనుదిరిగారు. ప్రజావాణి నిర్వహణ సమయంపై అవగాహన లేక ఆలస్యంగా వచ్చిన వారు తమ సమస్యలను అధికారులకు విన్నవించుకోలేకపోయారు.

భీంగల్ అర్బన్ స్థాయి వాలీబాల్ జట్ల ఎంపిక

## జిల్లా స్థాయి పోటీలకు 12 మంది బాలురు 12 మంది బాలికల ఎంపిక



**భీంగల్ నవంబర్ 2 జనం సాక్షి:**పట్టణంలోని కృషి హైస్కూల్‌లో సోమవారం ఎస్‌జీఎఫ్ భీంగల్ అర్బన్ స్థాయి అండర్-17 బాలురు, బాలికల వాలీబాల్ జట్ల ఎంపిక ప్రక్రియ నిర్వహించారు. ఈ ఎంపిక పోటీల్లో భీంగల్ అర్బన్ పరిధిలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన 12 మంది బాలురు, 12 మంది బాలికలను తుది జట్లకు ఎంపిక చేసినట్లు భీంగల్ అర్బన్ ఇన్‌చార్జి సెక్రటరీ సదమస్తుల రమణ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు మంగళవారం నందిపేట్‌లో జరగనున్న జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌లో పాల్గొంటారని పేర్కొన్నారు. నిరంతర వ్యాయామం ద్వారా శారీరక దృఢత్వాన్ని పెంపొందించుకోవాలని క్రీడాకారులకు సూచిస్తూ, జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన వారికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కృషి హైస్కూల్ కరస్పాండెంట్ అజిత్ రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు నరేష్, లింగం, అభిషేక్, రాకేష్, ప్రశాంత్, సుమన్, గంగాధర్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆన్ జాబ్ ట్రైనింగ్ కార్యక్రమము ప్రారంభం



**భీంగల్ నవంబర్ 2 జనం సాక్షి:**సోమవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల భీంగల్ నందు ఆన్ జాబ్ ట్రైనింగ్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా కళాశాల ప్రిన్సిపల్ చెరుకుపల్లి జయాపాల్ రెడ్డి మాట్లాడుతూ మూడు గ్రూపులకు సంబంధించిన క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా మీరు మీయొక్క అధ్యాపకులు ఇచ్చిన సమాచారం ప్రకారం మీరు శిక్షణ చేయాల్సి ఉంటుంది. ఈ శిక్షణ మీకు రాబోయే రోజుల్లో ఇది ఎంతగానో ఉపయోగ పడుతుంది. ఈ శిక్షణలో భాగంగా మీరు బ్యాంకు రంగానికి సంబంధించినది కావచ్చు , అగ్రికల్చర్ సొసైటీ కి సంబంధించినది కావచ్చు, ఫిషరీస్ సెంటర్స్ను సంబంధించినది కావచ్చు, ఇలా ఏ ఏ రంగాలలో మీకు సంబంధించినటువంటి పాఠ్యాంశాలకు అనుగుణంగా మీరు చేసేటటువంటి జాబ్ ట్రైనింగు ఎంతగానో భవిష్యత్తులో ఉపయోగపడుతుంది. కాబట్టి మీరు వెళ్ళిన చోట క్రమశిక్షణతో మరియు అధికారులు చెప్పేటటువంటి సమాచారాన్ని శ్రద్ధగా విని వాటిని మీ యొక్క హ్యాండ్ బుక్ లలో రాసుకుని వాటిని మీ అధ్యాపకులకు చూపించాలి. అంతేకాకుండా శిక్షణ తీసుకున్న ప్రతి అంశాన్ని జాగ్రత్తగా ఒడిసి పట్టుకొని రాబోయే రోజుల్లో ఎలా దీనిని నిత్య జీవితానికి అనువహించుకోవాలో ఇప్పుడే అర్థం చేసుకోవాలి. అంతేకాకుండా ఈ శిక్షణ అనంతరము కళాశాలకు సంబంధించిన ఇంటర్మీడియట్ మార్చిలో జరిగే చివరి పరీక్షలకు కూడా మీరు తర్ఫీదు కావలసి ఉంటుంది.మీరు గొప్పగా విద్య నభ్యసించి రాబోయే రోజుల్లో ఈ కళాశాలకు మీ తల్లిదండ్రులకు మీకు విద్యను అందించిన అధ్యాపక బృందానికి గొప్ప పేరు ప్రఖ్యాతలు అందిస్తారని ఆశిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు. ఇట్టి కార్యక్రమంలో భాగంగా కళాశాల ప్రిన్సిపాల్ చెరుకుపల్లి జయపాల్ రెడ్డి అధ్యాపక బృందం ఫిషరీస్ గ్రూప్ అధ్యాపకులు ఎస్ శ్రీనివాస్ అకౌంటింగ్ ట్యాగ్గేషన్ అధ్యాపకులు ధన్వాల్ క్రాంతి కృష్ణ మరియు ఆఫీస్ అసిస్టెంట్ షిప్ అధ్యాపకులు శ్రీమతి శోభారాణి మరియు ఎస్ శ్రీకాంత్ గారు విద్యార్థిని విద్యార్థులకు ఆన్ జాబ్ ట్రైనింగ్ గురించి ముఖ్యమైన సూచనలు చేశారు.ఇట్టి కార్యక్రమంలో భాగంగా కళాశాల ప్రిన్సిపాల్ చెరుకుపల్లి జయపాల్ రెడ్డి అధ్యాపక బృందం విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆంగ్ల సాహిత్యంపై పరిశోధనలో డాక్టరేట్ సాధించిన సికింద్రాపూర్ వాసి

### గ్రామీణ ప్రాంతం నుంచి ఉన్నత విద్యలో అరుదైన ఘనత

### యువతకు స్ఫూర్తిగా బాదవత్ సంతోష్



**భీమ్‌గల్, నవంబర్ 2 జనం సాక్షి** :ఉన్నత విద్యపై ఆసక్తి, పట్టుదలతో పరిశోధన రంగంలో రాణించి భీమ్‌గల్ మండలం సికింద్రాపూర్ గ్రామానికి చెందిన బాదవత్ సంతోష్ ఆంగ్ల సాహిత్యంలో డాక్టరేట్ పట్టా సాధించారు.గ్రామీణ ప్రాంతానికి చెందిన ఆయన ఈ ఘనత సాధించడం గ్రామంతో పాటు భీమ్‌గల్ మండలానికి గర్వకారణంగా నిలిచింది.రాజస్థాన్ రాష్ట్రంలోని ఝున్‌ఝునులో ఉన్న ఎస్‌జేజేటీయూ (ఎస్ జే జే టి యు)విశ్వవిద్యాలయం తరఫున సోమవారం ఆయనకు డాక్టరేట్ పట్టా లభించింది.విశ్వ విద్యాలయంలో డాక్టర్ అన్ను శర్మ మార్గదర్శకత్వంలో సంతోష్ “భారత స్వాతంత్ర్య కాలంలో సాహిత్యం యొక్క ప్రభావం” అనే అంశంపై పరిశోధన నిర్వహించారు. భారత స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో సాహిత్యం ప్రజల్లో జాతీయ భావాలను,దేశభక్తిని, స్వాతంత్ర్య కాంక్షను పెంపొందించడంలో పోషించిన పాత్రను ఆయన తన పరిశోధనలో విశ్లేషిం చారు.ఈ అంశంపై పరిశోధనను విజయవంతంగా పూర్తి చేసి డాక్టరేట్ పట్టా పొందారు. మారుమూల గ్రామానికి చెందిన ప్పటికీ ఉన్నత విద్యపై ఆసక్తితో నిరంతరం కృషి చేసి పరిశోధన రంగంలో ఈ స్థాయికి చేరుకోవడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.గ్రామీణ ప్రాంతాల యువత పట్టుదలతో ముందుకు సాగితే విద్యా, పరిశోధన రంగాల్లో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చనేందుకు సంతోష్ విజయం నిదర్శనంగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు.సంతోష్ సాధించిన ఈ ఘనతపై సికింద్రాపూర్ గ్రామస్తులు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో విద్యా, పరిశోధన రంగాల్లో మరిన్ని విజయాలు సాధించి సమాజానికి సేవ చేయాలని ఆకాంక్షించారు.

# బాధ్యతలు చేపట్టిన సింగిల్ విండో చైర్మన్ మనిగిరి నాగరాజు



లింగంపేట్ నవంబర్ 2(జనం సాక్షి)రైతుల సహకారంతో ముందుకు కొనసాగుతామని శెట్టిపల్లి సంగారెడ్డి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నూతన చైర్మన్ మనిగిరి నాగరాజు అన్నారు. సోమవారం లింగంపేట మండలంలోని చెప్పుల సంగారెడ్డి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలో నూతన పాలకవర్గం సభ్యుల ప్రమాణ శిఖర మహోత్సవ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నూతనంగా విండో చైర్మన్ గా అందరి రైతుల సమక్షంలో బాధ్యతలు చేపట్టారు ఆయన చేత పాలకవర్గం సభ్యుల చేత ప్రమాణస్వీకారం చేయించారు.అనంతరం ఆయనకు పలువురు ప్రజాప్రతినిధులు లింగంపేట మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సాయిరాం యాదవ్ గోకుల్, శెట్టిపల్లి సంగారెడ్డి గ్రామ సర్పంచ్ లక్ష్మీ అంజయ్య తో పాటు పలువురుశాలువలు కప్పి పూలదండ వేసి ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు పెద్దపీట వేసిందన్నారు రైతుల సహకారంతో విండో అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తానని అందుకు రైతులు సహకరించాలన్నారు. సింగిల్ విండోను ఆదర్శంగా తీర్చిదిద్దుతానని ఆయన అన్నారు. రైతులకు అవసరమైన ఎరువులు విత్తనాలు సబ్సిడీ పరికరాలు తో పాటు పంట రుణాలు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నుండి రైతులకు సేవలందిస్తానని హరులైనటువంటి రైతులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూస్తామన్నారు. రైతులకు సమస్యలు ఉన్నట్లయితే తమ దృష్టికి తీసుకురావాలని ఈ సందర్భంగా ఆయన అన్నారుకామారెడ్డి జిల్లాలో శెట్టిపల్లి సంగారెడ్డి సహకార సంఘాన్ని ఆదర్శంగా అందరి సహకారంతో తీర్చిదిద్దుదామన్నారు. 50 సంవత్సరాలు కళా నెరవేరింది సహకార సంఘం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు పోల్కంపేట్ గ్రామానికి చైర్మన్ పదవి దక్కలేదని ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు మండల కాంగ్రెస్ పార్టీ సాయిరాం యాదవ్ గోకుల్ మండల కాంగ్రెస్ నాయకులసహకారంతో పోల్కంపేట్ కు చేరమేను బాధ్యతలను అప్పగించడం జరిగిందన్నారు. బాధ్యతలు అప్పగించి నందుకు ఎప్పటికీ ఎమ్మెల్యేకు కాంగ్రెస్ నాయకులకు రైతులకు రుణపడి ఉంటారని ఈ సందర్భంగా ఆయన అన్నారు. ఎన్నికలప్పుడే రాజకీయాలని పార్టీలకు అతీతంగా ప్రతి రైతుకు జవాబుదారీగా పనిచేస్తానన్నారు.నాకు అలా నెరవేరింది అన్నారు.ఈ కార్యక్రమంలో లింగంపేట్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సాయిరాం యాదవ్ గోకుల్, మాజీ ఎంపీపీ మోహిద్, గ్రామ సర్పంచ్ కత్తుల లక్ష్మీ అంజయ్య, సింగిల్ విండో ప్రత్యేక అధికారి రాధిక కార్యదర్శి శ్రీనివాస్ సర్పంచులు కౌడ రవి, కమ్మరి ఏగొండ, సక్రు నాయక్, రాజు, ఇందిరమ్మ కమిటీ అధ్యక్షులు ఎల్లమ్మయ్య, ఆయా గ్రామాల సర్పంచులు కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు అభిమానులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో సత్యశోధక్ విద్యార్థినికి కాంస్య పతకం

### తెలంగాణ జట్టు తరపున ప్రాతినిధ్యం వహించి ప్రతిభ చాటిన అగ్యారం యుగేశ్వరి



**సిరికొండ, నవంబర్ 2 జనం సాక్షి:**జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో సత్య శోధక్ పాఠశాల విద్యార్థిని అగ్యారం యుగేశ్వరి కాంస్య పతకం సాధించి ప్రతిభ చాటింది. మహారాష్ట్రలోని కోపర్‌గావ్‌లో గల సంజీవని యూనివర్సిటీలో అక్టోబర్ 28 నుంచి 31 వరకు నిర్వహించిన జాతీయ స్థాయి మినీ సబ్ జూనియర్ అండర్-13 సాఫ్ట్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో తెలంగాణ జట్టు తరపున ప్రాతినిధ్యం వహించి ఈ ఘనత సాధించింది.రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపికైన యుగేశ్వరి, జాతీయ వేదికపైనా అద్భుత ప్రదర్శనతో పతకం సాధించడం పాఠశాలతో పాటు నిజామాబాద్ జిల్లాకు గర్వకారణంగా నిలిచింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య హర్షం వ్యక్తం చేశారు. యుగేశ్వరి సాధించిన విజయం ఆమె కృషి, పట్టుదల, క్రీడా నైపుణ్యానికి నిదర్శనమని అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించేలా పాఠశాల నిరంతరం ప్రోత్సహిస్తుందని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని విజ యాలు సాధించి ప్రాంతానికి, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# అంగన్వాడీ టీచర్లు, హెల్పర్ల సమస్యల పరిష్కారానికి మహా ధర్నా,కలెక్టరేట్ ముట్టడి

### ఎన్నికల హామీ మేరకు రూ.18 వేల వేతనం చెల్లించాలని డిమాండ్

### రాష్ట్ర అధ్యక్షురాలు మేకల సాయిశ్వరి



**జగిత్యాల బ్యూరో నవంబర్ 2(జనం సాక్షి)**అంగన్వాడీ టీచర్లు, హెల్పర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర అంగన్వాడీ టీచర్స్ ఉ హెల్పర్స్ అసోసియేషన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట మహా ధర్నా నిర్వహించి జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీ సిబ్బంది తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షురాలు మేకల సాయిశ్వరి,-ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు ఏశమేని గణేష్ అంగన్వాడి జిల్లా ప్రధాన కార్యదర్శి అంగరీ భాగ్యలక్ష్మి లు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లకు నెలకు రూ.18 వేల వేతనం చెల్లించాలని, వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. పీఎఫ్, హెల్త్ కార్డులు, రూ.25 లక్షల బీమా సౌకర్యం కల్పించడంతో పాటు నెలకు రూ.10 వేల పెన్షన్ అందించాలని కోరారు.అంగన్వాడీ సిబ్బందికి అదనంగా కేటాయిస్తున్న బీఎల్ఓ విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని, ఐసీడీఎస్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, పెండింగ్ బిల్లులు, టీఏ, డీఏ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. పదవీ విరమణ చేసిన సిబ్బందికి రావాల్సిన ప్రయోజనాలను తక్షణమే అందించాలని, అర్హత, సీనియారిటీ ఆధారంగా గ్రేడ్-2 సూపర్వైజర్ పోస్టులకు పదోన్నతులు కల్పించాలని కోరారు.అంగన్వాడీ టీచర్లు, హెల్పర్ల సమస్యలపై ప్రభుత్వం స్పందించి తక్షణమే పరిష్కార చర్యలు చేపట్టాలని సంఘం నాయకులు డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్లు నెరవేరే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు, దయావతి, లక్ష్మీ, లావణ్య,శారద,వనిత,హిమగిరి, షామిం సుల్తానా,సుమలత,సునీతా, లక్ష్మీ, పద్మ, మంజుల, ఏఐటీయూసీ గౌరవ అధ్యక్షుడు సుతారి రాములు, అందే వంశీ,జిల్ల మున్సిపాల్ ప్రధాన కార్యదర్శి ఎండి,ఉస్మాన్,భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు రామిల్ల రాంబాబు, ఎండి సమీర్,కిరణ్ కుమార్, బీజనపల్లి పాల్గొన్నారు

# సచ్చిదానంద స్వామిని ఎందుకు ఆహ్వానించారో జవాబు చెప్పాలే

### విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు




**మంథని, నవంబర్ 02, (జనంసాక్షి) :** పీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామిని మంథనికి ఎందుకు ఆహ్వానించారో ప్రజలకు మంథని ఎమ్మెల్యే, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్బాబు సమాధానం చెప్పాలని మంథని బీఆర్ఎస్ పార్టీ నాయకుడు, రచ్చపల్లి మాజీ సర్పంచ్ కనవేన శ్రీనివాస్ యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం పెద్దపల్లి జిల్లా మంథని పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు నివాసమైన రాజగృహాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పీఠాధిపతిని తీసుకువచ్చి ప్రవచనాలు చెప్పించడంతో ప్రజలకు జరిగిన మేలు ఏంటన్నారు. పీఠాధిపతి గణపతి సచ్చి దానంద స్వామిని మంత్రి శ్రీధర్ బాబు ఇంటి దోష నివారణకు పూజలు చేయించడానికి తీసుకువచ్చారే కానీ ప్రజల బాగుకు కోసం కాదని వారు ఆరోపించారు. ప్రజల బాగుకోసం పూజలు చేయాల్సి వస్తే ఎమ్మెల్యే సొంత గ్రామమైన ధన్వాడలో ఎందుకని ప్రశ్నించారు. నియోజకవర్గ ప్రజలు ఐదు సార్లు ఎమ్మెల్యేగా అవకాశం ఇస్తే అదే ధన్వాడలో గాని కాటారం మండల కేంద్రంలో ఒక్క బస్సు స్టాండ్ కట్టలేదని విమర్శించారు. ఆనాడు ఎన్నికల సమయంలో అధికారం, పదవుల కోసం 420 హామీలు ఇచ్చి వాటి అమలును మర్చిపోయారని, వారంటీ లేని గ్యారెంటీలను ఇచ్చి ప్రజలను మోసం చేసిన ఘనత మీది కాదా అన్నారు. పదేండ్ల బీఆర్ఎస్ ప్రభుత్వంలో ముఖ్యమంత్రిగా కేసీఆర్ సుపరిపాలన అందించారని, రైతు సంక్షేమానికి పెద్దపీట వేసి రైతుబంధు, రైతుబీమాలాంటి పథకాలను పకడ్బందీగా అమలు చేసి చరిత్రలో నిలిచారని కొనియాడారు. ఈనాడు రైతు సంక్షేమాన్ని విస్మరించి రైతుబంధు, రైతుబీమాలకు ఎగనామం పెట్టారన్నారు. రైతు సంక్షేమానికి రూపాయి ఖర్చు చేయకుండా ఈనాడు పీఠాధిపతి పర్యటనకు కోట్లు ఖర్చు చేశారని వారు ఆరోపించారు. పీఠాధిపతి రాకకోసం ఖర్చు చేసిన డబ్బులను పేద ప్రజల బాగు కోసం వినియోగిస్తే బాగుండేది కాదా అని వారు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ విలేకరుల సమావేశంలో బిఆర్ఎస్ నాయకులు తంబరం తిరుపతి, ఆరెపల్లి కుమార్ పుప్పాల తిరుపతి, జంజర్ల శేఖర్, పెగడ శ్రీను, మంథని లక్ష్మణ్, కాయతి సమ్మయ్య, పోలు కనకరాజు, ఆసిఫ్,ఇర్ఫాన్, జావీద్ తదితరులు పాల్గొన్నారు.

# నీలకుంట చెరువు ఆక్రమణకు అడ్డుకట్ట

### హద్దుల గుర్తింపునకు రెవెన్యూ అధికారుల సర్వే



**రాయికల్ నవంబర్ జనం సాక్షి:**రాయికల్ మండలం అల్లీపూర్ గ్రామ శివారులోని నీలకుంట చెరువు ఆక్రమణకు గురవుతోందన్న సమాచారంతో రెవెన్యూ అధికారులు అప్రమత్తమయ్యారు.చెరువు భూమిలో అక్రమంగా మట్టి,మొరం తరలించి పోసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు తెలుసుకున్న రాయికల్ తహశీల్దార్ ఎస్. నాగార్జున సిబ్బందితో కలిసి వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు.ఆక్రమణ ప్రయత్నాలను అడ్డుకునేందుకు తక్షణ చర్యలు చేపట్టారు.ఈ సందర్భంగా రెవెన్యూ రికార్డుల ఆధారంగా నీలకుంట చెరువు అసలు హద్దులు,విస్తీర్ణాన్ని గుర్తించేందుకు సంబంధిత అధికారులతో సర్వే నిర్వహించాలని ఆదేశించారు. మండల సర్వేయర్ సంధ్యారాణి, రెవెన్యూ ఇన్స్పెక్టర్ పద్మయ్య, గ్రామ జిపిఓ నరేష్, ఇరిగేషన్ శాఖ సిబ్బంది సంయుక్తంగా రికార్డుల ప్రకారం చెరువు సరిహద్దులను గుర్తిస్తూ కొలతలు చేపట్టారు.చెరువు భూమి ఆక్రమణకు గురికాకుండా గుర్తించిన హద్దుల వెంబడి కంచె ఏర్పాటు చేసే చర్యలు చేపట్టారు.ప్రభుత్వ భూములను ఆక్రమించేందుకు ప్రయత్నించినా,చెరువు భూముల్లో అక్రమ నిర్మాణాలు లేదా మట్టి, మొరం పోసినా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ హెచ్చరించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చెరువు పరిసరాల్లో రక్షణ కంచె ఏర్పాటు చేయడంతోపాటు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. చెరువుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని,ప్రభుత్వ ఆస్తులను కాపాడేందుకు గ్రామస్థులు కూడా సహకరించాలని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఇరిగేషన్ శాఖ అధికారి వెంకటేష్, గ్రామ సర్పంచ్ ఎంబారి గౌతమి వెంకటేష్, గ్రామస్థులు పాల్గొన్నారు



## మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు పరామర్శలు



**కమాన్పూర్, నవంబర్ 02,(జనంసాక్షి) :** పెద్దపల్లి జిల్లా కమాన్పూర్ మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలను మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ సోమవారం సాయంత్రం పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. కమాన్పూర్ గ్రామంలో ఇటీవల మరణించిన పెంచాల రాములు కుటుంబాన్ని పరామర్శించారు. సిద్దిపల్లె గ్రామంలో ఇటీవల మరణించిన జాబు గట్టయ్య కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి తెలిపారు. రొంపికుంట గ్రామంలో ఇటీవల మరణించిన బొడ్డుపెల్లి సాయమలమ్మ, వడ్లకొండ రాజేశ్వరి కుటుంబాలను పరామర్శించారు. అలాగే అనారోగ్యంతో బాధపడుతున్న కమ్మగోని శంకరయ్యను పరామర్శించి, ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. బిఆర్ఎస్ మండల కన్వీనర్ తాటికొండ శంకర్, నాయకులు బొమ్మగాని అనిల్ గౌడ్, ఉప్పరి శ్రీనివాస్, గుర్రం లక్ష్మీమల్లు, నీలం శ్రీనివాస్, కొండ వెంకటేష్, జాబు సతీష్, జాబు శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## సాంపల్లి సామ్ చెరువు కబ్జా గురవుతోందని ఫిర్యాదు



**డిచ్పల్లి నవంబర్ 2 జనం సాక్షి:డిచ్** పల్లి మండలం సాంపల్లి సామ్ చెరువు కబ్జాకు గురవుతోందని, సర్వే చేపట్టి శిఖం భూమి కాపాడాలని మండల ప్రజావాణిలో అధికారు లకు సాంపల్లి, సాంపల్లి తాండ, మెలయ్య తాండ, గుడి తాండ వాసులు కొందరు ఫిర్యాదు చేశారు. చెరువును దౌర్జన్యంగా కబ్జా చేయడంతో ఆయకట్టు రైతులకు నీరు అందరి పరిస్థితి ఏర్పడుతోందన్నారు. మెంట్రాజ్ పల్లి శివారు సాంపల్లిలో 334 సర్వే నెంబరులో 42.0900 ఎకరాల్లో చెరువు విస్తీర్ణం కాగా, ఇందులో చాలా మేర కబ్జాకు గురవుతోందన్నారు. కొందరు శిఖం భూమిని ఆక్రమించి పంటలు సాగు చేస్తున్నారనీ, గతంలో మిషన్ కాకతీయ పథకం క్రింద ఈ చెరువును పునరుద్ధరణ పనులు చేపట్టినప్పటికీ చుట్టూ కందకం తీయకపోవడంతో శిఖం భూమి కబ్జా పెరిగిపోతుందని పేర్కొన్నారు.చెరువు చుట్టు ఉన్న రైతుల్లో కొందరు తమ పలుకుబడితో శిఖం భూమిని యదేచ్ఛగా ఆక్రమించుకుంటున్నా గ్రామంలో ప్రశ్నించేందుకు భయపడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. సాంపల్లి సామ్ చెరువును రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులతో ఉమ్మడి సర్వే చేయించి ఆక్రమణకు గురైన శిఖం భూమిని వెలికితీసి చెరువు చుట్టూ కంచె వేయించాలని కోరారు.

## పశువులకు ఉచిత నట్టల నివారణ మందులు పంపిణీ



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి నవంబర్ 2 జనం సాక్షి:**పశువులకు ఉచిత నట్టల నివారణ మందులు పంపిణీ కార్యక్రమం నవంబర్ 2 నుండి 7వ తేదీ వరకు నిర్వహించబడుతుందని పశు వైద్యాధికారి డాక్టర్ బాబురావు కాందారే తెలిపారు.మొదటి రోజైన సోమవారం బోర్గాం (పి) గ్రామంలో పశువైద్య సిబ్బంది ప్రత్యేక క్యాంప్ నిర్వహించి, మొత్తం 260 ఆవులు మరియు గేదెల దూడలకు నట్టల నివారణ మందులను వేశారు.నట్టల నివారణ ప్రాముఖ్యత దూడలలో అంతర్గత పరాన్నజీవుల (నట్టల) వల్ల రక్తహీనత, నీరసం,ఎదుగుదల లోపించడం వంటి సమస్యలు తలెత్తుతాయి.సకాలంలో నట్టల నివారణ మందులు వేయడం ద్వారా దూడల రోగనిరోధక శక్తి పెరిగి, అవి ఆరోగ్యంగా , వేగంగా ఎదుగుతాయి. పశుగ్రాసం సద్వినియోగం అవ్వడానికి, భవిష్యత్తులో పాల దిగుబడి పెరగడానికి ఈ నట్టల నివారణ ఎంతో దోహదపడుతుంది.ఈ నెల 7వ తేదీ వరకు మండలంలోని మిగిలిన గ్రామాల్లో కూడా ఈ ఉచిత కార్యక్రమం కొనసాగుతుందని, పశుపోషకులు, పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ దూడలకు నట్టల మందులు వేయించుకోవాలని పశువైద్య శాఖ అధికారులు కోరారు.

# బాణసంచా విక్రయాల్లో నిబంధనలు తప్పనిసరి

## భద్రతా ప్రమాణాలు పాటించకుంటే చర్యలు తప్పవు : పోలీస్ కమిషనర్

- దీపావళి పండుగ నేపథ్యంలో తాత్కాలిక ఫైర్ వర్క్స్ లైసెన్స్ నిమిత్తము క్రాకర్స్ విక్రయదారులు ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి
- భద్రతా ఏర్పాట్లలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకూడదు పోలీస్ కమిషనర్ వెల్లడి



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి నవంబర్ 2 జనం సాక్షి:** దీపావళి పండుగ నేపథ్యంలో తాత్కాలిక ఫైర్ వర్క్స్ దుకాణాల లైసెన్స్ నిమిత్తము క్రాకర్స్ విక్రయ దారులు ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని భద్రత ఏర్పాట్లలో ఇలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకూడద నీ పోలీస్ కమిషనర్ తెలిపారు. నిజామాబాద్ జిల్లా పాలిటెక్నిక్ క్రాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, హోల్ సెల్ షాపుల యాజమాన్యాలతో సోమవారం ఉదయం 11 గంటలకు నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ హాల్‌లో నిజామాబాదు పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ బాణసంచా విక్రయాలు నిర్వహించే ప్రతి షాపు యాజమాన్యం ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని,సంబంధిత శాఖల నుంచి అవసరమైన లైసెన్సులు పొందిన తర్వాతే విక్రయాలు చేపట్టాలని స్పష్టం చేశారు.షాపుల వద్ద అగ్నిప్రమాదాలు జరగకుండా తగిన ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలని , అగ్నిమాపక పరికరాలు అందుబాటులో ఉంచుకోవాలని , విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వంటి ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసు కోవాలని సూచించారు. ప్రజల భద్రతకు సంబం ధించిన అంశాల్లో ఎక్కడా అలసత్వం ప్రదర్శించ రాదని హెచ్చరించారు.ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా బాణసంచా విక్రయాలు నిర్వహించినా, భద్రతా ప్రమాణాలు పాటించకపోయినా సంబంధిత షాపు యాజమాన్యాలపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

**తప్పనిసరిగా ఉండవలసినవి**

లైసెన్స్ కాపీ దుకాణం ముందు కనిపించేలా ఉండాలి.అగ్నిమాపక యంత్రాలు, 2 ఇసుక బకెట్లు , 2 నీటి బకెట్లు"పొగ త్రాగడం నిషేధం –NO SMOKINGc బోర్డు తప్పనిసరిగా ఉండాలి. దుకాణంలో పొగ త్రాగడం , అగ్గిపుల్ల , లైటర్ , వంట చేయడం పూర్తిగా నిషేధం.18 సంవత్సరాల లోపు పిల్లలకు బాణాసంచా అమ్మకూడదు.రాత్రి 10 గంటల నుండి ఉదయం 6 గంటల వరకు దుకాణం మూసివేయాలి.దుకాణం దగ్గర టపాసులు కాల్చి చూపించకూడదు.అత్యవసర సంప్రదింపు పోలీస్ – 112 / ఫైర్ – 101 హెల్ప్ లైన్ నంబర్లను వినియోగించుకోవాలి.ప్రజల భద్రతే పోలీస్ శాఖ ప్రథమ ప్రాధాన్యత అని , వ్యాపారులు పోలీస్ శాఖకు సహకరిస్తూ సురక్షిత వాతావరణంలో వ్యాపార కార్యకలాపాలు నిర్వహించాలని పోలీస్ కమిషనర్ సూచించారు.ఈ సమావేశంలో నిజామాబాద్ ఏసిపి శుభం ప్రకాష్ , నిజామాబాద్ టౌన్ సిఐ సత్యనారాయణ , నిజామాబాద్ రూరల్ సీఐ శ్రీధర్ రెడ్డి,నిజామాబాద్ టౌన్ 1 ఎస్.హెచ్.ఓ శ్రీనివాస్,2 టౌన్ ఎస్సై యాదగిరి గౌడ్ , 3 టౌన్ ఎస్ఐ హరిబాబు,4 టౌన్ ఎస్సై 2 సాయన్న ,5 టౌన్ ఎస్ఐ సునీల్ , పాలిటెక్నిక్ క్రాకర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పేట సంతోష్ ,సెక్రెటరీ పసుమర్తి ప్రవీణ్, క్యాషియర్ బొంపల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.



# అకాల వర్షాల ముప్పు.. కొనుగోలు కేంద్రాల జాడేది?

దక్కుతుందో లేదోనని ఆందోళన చెందుతున్నారు. ఒకవైపు అకాల వర్షాల భయం.. మరోవైపు కొనుగోలు కేంద్రాల జాడ లేకపోవడం.. ఇంకోవైపు దళారుల ఒత్తిడి.. ఇలా మూడు వైపులా రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ధాన్యం తడిసిపోతే నాణ్యత తగ్గి మద్దతు ధర కోల్పోయే ప్రమాదం ఉండటంతో అన్నదాతలకు కంటిమీద కునుకు లేకుండా పోతోంది.

**ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలి!**

రైతులు పండించిన ధాన్యాన్ని విక్రయించుకోవడానికి ఇన్ని అవస్థలు పడాల్సిన పరిస్థితి రావడం బాధాకరమని మండల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఇకనైనా మేల్కొని వెంటనే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని, దళారుల బారిన పడకుండా ప్రతి రైతు నుంచి మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. అకాల వర్షాలతో ధాన్యం తడిసి నష్టపోయే పరిస్థితి రాకముందే అధికారులు క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టాలని, రైతుల కష్టాన్ని గిట్టుబాటు ధర లేకుండా వృథా కానివ్వకుండా ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని కోరుతున్నారు.

# సామాజిక సేవకుడి మనోవేదన

**తెలంగాణ మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి వేల్పుల ప్రవీణ్ కుమార్**

**రాయికల్ నవంబర్ 2 జనంసాక్షి :**



అలీపూర్ గ్రామంలో ఉన్నటువంటి ప్రభుత్వ భూమిని కొందరు తమ ఆధీనంలోకి తీసుకున్నారని మనసు కలత చెంది తన మనోవేదనను పాత్రికేయ పరంగా పంచుకున్నాడు. విషయానికి వస్తే. ప్రస్తుత జీవన విధానాన్ని నెమరేసు కుంటే ఒకనాడు క్రీడా ప్రాంగణాలు లేకపోయినప్పటికిని ప్రభుత్వ పాఠశా లలను ఆసరాగా చేసుకుని వ్యాయమా ఉపాధ్యాయుల ఆధీనంలో ఆటలాడుకుంటూ చెడుదారులకు దూరం గా ఉంటూ మంచి మార్గంలో నడిచేవారు ప్రస్తుతం గాంజాయ్కి బానిసై క్రీడా ప్రాంగణాలు లేక చెడు దారికి ప్రాధాన్యతమిస్తున్నారు. కావున ప్రభుత్వ అధికారులు రాజకీయ నాయకులు గౌరవ ఎమ్మెల్యే ఎమ్మెల్సీ ఎంపీ గారు అల్లిపూర్ గ్రామాన్ని దృష్టిలో ఉంచుకొని కబ్జాకోరులో నుండి గ్రామ యువత సన్మార్గంలో నడచడానికి ఆసరాగా ఆ యొక్క భూమిని క్రీడ ప్రాంగణానికి వెసులుబాటు కల్పిస్తే చెడుదారుకు వెళ్లకుండా మంచి మార్గంలో వెళ్లడానికి అవకాశం ఉన్నది కావున అలాగే అల్లిపురం గ్రామంలో రైతాంగానికి బీటు లేక నానా అవస్థలు పడుతున్నారు. ప్రయత్నం మా వారికి కూడా ఉపయోగపడే అవకాశం ఉన్నది అలాగే ఓపెన్ జిమ్ కూడా వేసుకోవడానికి ఆస్కారం ఉన్నది వీటన్నిటిని దృష్టిలో ఉంచుకొని కబ్జాకోరుల నుండి విముక్తి కల్పించి గ్రామపంచాయతీకి అప్పగించ గలరని వేడుకుంటూ సదా అందరివాడు నిరంతరం గ్రామ సంక్షేమాన్ని కోరుకునే వ్యక్తిగా పాత్రికేయ పరంగా తమరు అందరిని వేడుకుంటూ..

# డే వాచ్మెన్ మహిళా పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

**సిరికొండ, నవంబర్ 2 జనంసాక్షి:**

సిరికొండ మండలంలోని పెద్దవాల్గొట్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో డే వాచ్మెన్ మహిళా పోస్టు భర్తీకి అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రత్యేక అధికారిణి షేక్ పర్వీన్ తెలిపారు.ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 3వ తేదీ నుంచి 8వ తేదీలోపు ఒరిజినల్ ఆధార్ కార్డుతో పాటు పదో తరగతి మెమో జిరాక్స్ ప్రతిని తీసుకొని పాఠశాలలో సంప్రదించాలని సూచించారు. ఎంపికైన అభ్యర్థి ప్రతిరోజూ ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు విధులు నిర్వహించాల్సి ఉంటుందని తెలిపారు. ఈ పోస్టుకు నెలకు రూ.9,750 వేతనం చెల్లించనున్నట్లు ప్రత్యేక అధికారిణి పేర్కొన్నారు.




# ప్రజలు నిర్భయంగా పోలీసు సేవలు వినియోగించుకోవాలి

## ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా 37 ఫిర్యాదులను స్వీకరించిన పోలీస్ కమిషనర్

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి నవంబర్ 2 జనంసాక్షి:**ప్రజలు మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా నిర్భయంగా పోలీసు సేవలను వినియోగించు కోవాలని కమిషనర్ ఆఫ్ పోలీస్ సాయి చైతన్య తెలిపారు.సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదు దారుల నుండి అర్జీలను స్వీకరించి వాటిని తక్షణ పరిష్కారం కోసం సంబంధిత పోలీస్ స్టేషన్ ల యొక్క ఎస్.ఐ, సి.ఐ లకు ఫోన్ ద్వారా మాట్లాడి సమస్య స్థితిని, పరిష్కారానికి తగు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలు నిర్భయంగా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా ఎలాంటి, పైరవీలు లేకుండా స్వచ్ఛందంగా పోలీసు సేవల్ని వినియోగించుకుంటూ, వారి వారి సమస్యలు చట్ట ప్రకారం పరిష్కరించు కునేలా, పోలీసులు ప్రజలకు మరింత దగ్గరయ్యేలా, శాంతి భద్రతలు పరిరక్షిస్తూ ముందుకు సాగడమే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ పని చేస్తుందని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య తెలిపారు.ప్రజా సమస్యలు పై ఫిర్యాదులు నేరుగా స్వీకరిస్తూ ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం ద్వారా సమస్యలు పరిష్కరిస్తున్నాము అని తెలియజేశారు. వివిధ ఫిర్యాదు లకు సంబందించిన 37 ఫిర్యాదు లను స్వీకరించారు.



### తెలంగాణ ప్రగతిశీల మున్సిపల్ వర్కర్ యూనియన్ ఆధ్వర్యంలో

## ఆర్టీవో కార్యాలయం ఎదుట మున్సిపల్ కార్మికుల ధర్నా



**బోధన్, నవంబర్ 2 ( జనంసాక్షి ) :** మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం తెలంగాణ ప్రగతిశీల మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి నిరసన తెలిపారు. తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (టీ యూ సీ ఐ ) ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులకు రావలసిన పీ ఆర్ సీ వేతన బకాయిలు, శానిటేషన్ రంగంలో పనిచేస్తున్న కార్మికులకు పనిముట్లను ఇవ్వాలని, కార్మికుల వేతనాల నుండి కట్ అవుతున్న పీ.ఎఫ్ ఈ.ఎస్.ఐ డబ్బులను వారి ఎకౌంట్లో వేయాలని, ఈఎస్ఐ ఆసుపత్రిని బోధన్ పట్టణంలోని లైన్స్ క్లబ్ ఆసుపత్రి వద్ద గల జనరల్ ఆస్పత్రికి మార్చి ఇక్కడనే కార్మికులకు వైద్య సౌకర్యాలను అందించాలని ఈఎస్ఐ కార్డులను అందరికీ ఇవ్వాలని కార్మికులకు రావలసిన నాలుగు నెలల వేతన బకాయిలను వెంటనే చెల్లించి ప్రతి నెల నెల ఇవ్వాలని తదితర డిమాండ్ల పరిష్కారంతో ఆర్డీవో కార్యాలయం ముందు ధర్నా చేసి డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఆర్టీవో విజయ కుమారికి అందించారు. ఈ మేరకు ఆర్డీవో విజయ కుమారి మునిసిపల్ చైర్మన్ తో ఫోన్లో మాట్లాడి, కార్మికుల టిఆర్సి బకాయిలను వెంటనే చెల్లించాలని పనిముట్లను ఇవ్వాలని ఇతర సమస్యలను కూడా పరిష్కరించాలని మాట్లాడగా అందుకు వారు అంగీకరించడం జరిగిందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర నాయకులు బి మల్లేష్ యూనియన్ నాయకులు బి. పర్వయ్య, కే.గంగమని, మరు భాయి, లావణ్య, జి.రాజు, భూమయ్య, పార్వతి, గంగామణి, కృష్ణ, మాధవి, సాయిలు, తుకాబాయి, లక్ష్మి, పార్వతి తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.




## ఈ నెల 5వ తేదీన జరిగే జంపాల చంద్రశేఖర్ ప్రసాద్ ర్యాలీని జయప్రదం చేయండి

**బోధన్, నవంబర్ 2 ( జనంసాక్షి ) :**

ఈనెల 5వ తేదీన నిర్వహించే జంపాల చంద్రశేఖర్ ప్రసాద్ ర్యాలీని జయప్రదం చేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పి డి ఎస్ యూ ) నిజామాబాద్ జిల్లా కార్యవర్గ ఆధ్వర్యంలో స్థానిక బోధన్ పట్టణంలోని పీఆర్టీ యూ భవన్లో పత్రికా విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ×జిల్లా అధ్యక్షులు ఆర్ గౌతమ్ కుమార్, ప్రధాన కార్యదర్శి జన్నారవు రాజేశ్వర్× లు మాట్లాడుతూ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై సమాజ మార్పుకై కామ్రేడ్ జంపాల చంద్రశేఖర్ ప్రసాద్ ఉద్యమించాడని, పాలకవర్గ తప్పుడు విధానాలపై పోరాడిన జంపాల చంద్రశేఖర్ ప్రసాద్ ను నాటి పాలకులు ఎన్కౌంటర్ పేరిట పొట్టన పెట్టుకున్నారని, వారి స్ఫూర్తితో రాష్ట్రవ్యాప్తంగా బలమైన విద్యార్థి ఉద్యమాన్ని పి డి ఎస్ యూ నిర్మించిందని వారు పేర్కొన్నారు. నాటినుండి నేటి వరకు పాలకులు ప్రశ్నించే తత్వాన్ని తట్టుకోలేరని నాటి నుండి నేటి వరకు పాలకవర్గ తప్పులను ఎత్తి చూపిన విద్యార్థులపై తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నారని వారు గుర్తు చేశారు .రాష్ట్రంలో విద్య పేరిట తీవ్రమైన దోపిడీ జరుగుతున్నదని ప్రైవేటీకరణ కార్పొరేటీకరణ తీవ్రతమైందని, ప్రభుత్వ విద్య పేదలకు అందని ద్రాక్ష లాగా మారిందని వారు పేర్కొన్నారు .స్కాలర్షిప్ల రియాంబర్స్మెంట్ రాక విద్యార్థులు ఉన్నత చదువులకు దూరం అవుతున్నారని పర్యవేక్షణ లేక విద్యావ్యవస్థ కుంటుపడుతుందని కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చే మూడు సంవత్సరాలు దాటిన విద్యాశాఖ మంత్రిని కేటాయించే పరిస్థితి లేదని వారు మండిపడ్డారు. విద్యార్థి ఉద్యమాల దిక్సూచి జంపాల చంద్రశేఖర్ ప్రసాద్ 50 ఏండ్ల అమరత్వస్ఫూర్తితో విద్యా రంగ సమస్యలపై విద్యార్థుల హక్కులకై పోరాడాలని వారి పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పి ఎస్ యూ జిల్లా ఉపాధ్యక్షులు ఎన్ కార్తీక్,సహాయ కార్యదర్శి ప్రిన్స్, జిల్లా కోశాధికారి సాయినాథ్ , బోధన్ డివిజన్ నాయకులు సచిన్,అనిల్,రాజు తదితరులు పాల్గొన్నారు.





## జగ్గని ఓర్రె లైనింగ్ పనులపై ప్రజావాణిలో ఫిర్యాదు

**మల్యాల నవంబర్ 2 (జనంసాక్షి)**

మల్యాల మండల కేంద్రంలోని మల్యాల చెరువు వర్షాకాలంలో మత్తడి దుంకి సూరప్ప చెరువుకు వెళ్లే జగ్గని ఓర్రె మార్గాన్ని చేపడుతున్న నూతన లైనింగ్ పనులను ఓర్రెలో అక్రమంగా నిర్మించుకున్న నిర్మాణాలను తొలగించి ఒకే విధమైన వెడల్పుతో నిర్మాణం చేపట్టాలని మాజీ ఎంపీటీసీ రాచర్ల రమేష్,విహెచ్ పి నాయకులు యాగర్ల లక్ష్మీనారాయణ,జున్ను మధు మండల పరిషత్ ప్రజా కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణిలో వినతిపత్రం సమర్పించారు.సుమారు 2కోట్ల 40 లక్షల బడ్జెట్ తో నిర్మాణం చేపడుతున్న లైనింగ్ పనులకు అధికారులు 10 మీటర్లతో మెజర్మెంట్ వేసినప్పటికీ కొన్ని ప్రాంతాల్లో 5 మీటర్లు నచ్చిన విధంగా చేయడం వల్ల వరద ప్రభావం ఎక్కువ అయినప్పుడు ప్రమాదం జరిగే అవకాశాలు ఉంటాయని భవిష్యత్తులో వరద వచ్చి ప్రమాదం జరిగితే కాంట్రాక్టర్ అధికారులు ఎవరు బాధ్యత వహిస్తారు.నిర్మాణంపై అధికారులు స్పందించి ఒకే విధంగా కాల్వ పనులు చేపట్టాలనికోరుతున్నామని లేని యెడల జిల్లా స్థాయి అధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.







## పేద విద్యార్థులకు పోలీసు ఉద్యోగాలే లక్ష్యంగా కేఎన్ఆర్ ఇన్స్టిట్యూట్ సేవలు

### 15 ఏళ్లుగా వేలాది మంది అభ్యర్థులకు శిక్షణ.. ఘనంగా 15వ వార్షికోత్సవ వేడుకలు

**కరీంనగర్ టౌన్, నవంబర్ 02, జనంసాక్షి)**

గ్రామీణ ప్రాంతాల పేద విద్యార్థులకు పోలీసు ఉద్యోగాల కోచింగ్‌ను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో కేఎన్ఆర్ ఇన్స్టిట్యూట్ గత 15 ఏళ్లుగా సేవలందిస్తోందని సంస్థ నిర్వాహకుడు, ప్రస్తుతం కర్నూలు జిల్లాలో ఎస్ఐగా పనిచేస్తున్న మారెం రాజు తెలిపారు. హైదరాబాద్‌కు వెళ్లి శిక్షణ పొందడం పేద విద్యార్థులకు ఆర్థిక భారంగా మారుతుండటంతో తక్కువ ఫీజుతో స్థానికంగానే నాణ్యమైన శిక్షణ అందించాలనే ఉద్దేశంతో 2011 నవంబర్ 2న సంస్థను ప్రారంభించినట్లు వివరించారు.

ఇప్పటివరకు వేలాది మంది అభ్యర్థులకు శిక్షణ అందించగా, వందలాది మంది కానిస్టేబుళ్లుగా, ఎస్ఐలుగా ఎంపికయ్యారని తెలిపారు. 2011లో తొలి ఏడాదే 900 మందికి శిక్షణ ఇవ్వగా, వారిలో 200 మంది కానిస్టేబుళ్లుగా, 30 మంది ఎస్ఐలుగా ఎంపికయ్యారని చెప్పారు. 2015?16 నోటిఫికేషన్ సమయంలో 3 వేల మందికి శిక్షణ ఇవ్వగా 800 మంది కానిస్టేబుళ్లుగా, 30 మంది ఎస్ఐలుగా ఎంపికయ్యారని పేర్కొన్నారు. 2022?23 నోటిఫికేషన్ సమయంలో సుమారు 5 వేల మందికి శిక్షణ అందించగా 1,200 మంది కానిస్టేబుళ్లుగా, 50 మంది ఎస్ఐలుగా ఎంపికైనట్లు వివరించారు.

ప్రస్తుత పోలీసు ఉద్యోగాల భర్తీలో భాగంగా ఇప్పటికే సుమారు 1,500 మందికి ప్రిలిమినరీ పరీక్ష శిక్షణ అందించామని, తదుపరి దశలో మరో 3 వేల మందికి శారీరక సామర్థ్య పరీక్షలు, తుది రాత పరీక్షలకు శిక్షణ ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. అభ్యర్థుల్లో పరీక్షల పట్ల భయం తొలగించేందుకు ప్రతిరోజూ పరీక్షలు, ప్రతి ఆదివారం మెగా గ్రాండ్ టెస్టులు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఆర్థిక స్థోమత లేని పేద విద్యార్థులకు, తల్లిదండ్రులు లేని అభ్యర్థులకు ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు వెల్లడించారు. భవిష్యత్తులో 10 వేల మంది కానిస్టేబుళ్లను, వెయ్యి మంది ఎస్ఐలను పోలీసు శాఖకు అందించడమే తన లక్ష్యమని పేర్కొన్నారు.

ఇదిలా ఉండగా, కేఎన్ఆర్ ఇన్స్టిట్యూట్ 15వ వార్షికోత్సవ వేడుకలను సోమవారం కరీంనగర్‌లోని టీఎన్జీవో భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన బాలలత జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోటీ పరీక్షల్లో విజయం సాధించాలంటే లక్ష్యంపై స్పష్టత, క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర సాధన అవసరమని విద్యార్థులకు సూచించారు. అపజయాలకు కుంగిపోకుండా వాటిని విజయానికి మెట్లుగా భావించి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. పోటీ పరీక్షల సవాళ్లు, సమయపాలన, మానసిక స్థైర్యంపై విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు.

అనంతరం ముఖ్య అతిథి బాలలతను ఇన్స్టిట్యూట్ నిర్వాహకులు శాలువా, జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు. విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేసి వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. సంస్థ డైరెక్టర్ మారం సుస్మిత రాజు మాట్లాడుతూ 15వ వార్షికోత్సవానికి హాజరై విద్యార్థులకు విలువైన సూచనలు అందించిన బాలలతకు కృతజ్ఞతలు తెలిపారు. శిక్షణ పొందుతున్న అభ్యర్థులు కష్టపడి చదివి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని ఆకాంక్షించారు. నిరుద్యోగ యువతకు నాణ్యమైన శిక్షణ అందిస్తూ వారి ఉద్యోగ కలలను సాకారం చేసేందుకు సంస్థ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అభ్యర్థులు, అధ్యాపకులు, ఇన్స్టిట్యూట్ నిర్వాహకులు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.





# కార్మికుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నాం

## ఐ ఎన్ టి యు సి గెలిస్తే కార్మికుల సంక్షేమానికి పెద్దపీట వేస్తాం: కోట రవీందర్ రెడ్డి



**యైటింక్లైన్ కాలనీ (జనంసాక్షి)నవంబర్ 2:**
సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారానికి ఐ ఎన్ టి యు సి నిరంతరం కృషి చేస్తోందని ఆర్జీ-3, ఏ పి ఏ ఏరియా ఐ ఎన్ టి యు సి ఉపాధ్యక్షులు కోట రవీందర్ రెడ్డి అన్నారు. సోమవారం ఉదయం 7 గంటలకు ఓసిపి -1 ఎస్ డ డి సెక్షన్‌లో, 9 గంటలకు బేస్ వర్క్‌షాప్‌లో ఐఎన్టీయూసీ ఆధ్వర్యంలో గేట్ మీటింగ్‌లు నిర్వహించారు. నాన్ ఆపరేషన్ పిట్ సెక్రటరీ ఎనగందుల సదానందం అధ్యక్షతన జరిగిన ఈ సమావేశాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై కార్మికుల సమస్యలపై మాట్లాడారు.ఈ సందర్భంగా రవీందర్ రెడ్డి మాట్లాడుతూ.. ఐఎన్టీయూసీకు స్ట్రక్చర్ మీటింగ్‌లో మాట్లాడే అవకాశం లేకపోయినప్పటికీ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండటంతో కార్మికుల సమస్యలను మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. ఆయన సహకారంతో ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్కను జనక్ ప్రసాద్ ఆధ్వర్యంలో పలుమార్లు కలిసి కార్మికుల సమస్యలను వివరించినట్లు పేర్కొన్నారు.
ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కార్మికులకు సొంతింటి పథకం అమలుకు చర్యలు ప్రారంభించామని, దీపావళి తర్వాత ఈ పథకానికి సంబంధించిన విధివిధానాలను వెల్లడిస్తామని తెలిపారు. మెడికల్ బోర్డు విధానంలో మార్పులు తీసుకొచ్చి, ప్రతి ఏరియాలో అక్కడికక్కడే మెడికల్ బోర్డులు నిర్వహించేలా అధికారులకు ఆదేశాలు ఇప్పించామని, వైద్య పరీక్షల విషయంలో కార్మికులకు అన్యాయం జరగకుండా చూస్తామని హామీ ఇచ్చారు.
గత పదేళ్ల పాలనలో సింగరేణి ప్రాంతాల అభివృద్ధి నిర్లక్ష్యానికి గురైందని, సింగరేణి నిధులను ఇతర ప్రాంతాల్లో వినియోగించడం వల్ల గనుల ప్రాంతాల్లో రహదారులు, డ్రైనేజీ వ్యవస్థలు, కార్మికుల మౌలిక సదుపాయాలు వెనుకబడ్డాయని విమర్శించారు. ఐఎన్టీయూసీ కృషితో సెంటినరీ కాలనీ కార్మికుల కోసం రూ.9 కోట్లతో నూతన పైప్‌లైన్ నిర్మాణానికి చర్యలు చేపట్టామని, సెంటినరీ కాలనీ నుంచి సైలో బంకర్ వరకు నాలుగు లేన్ల రహదారి నిర్మాణం చేపట్టనున్నట్లు వెల్లడించారు. సి ఎస్ ఆర్ , డి ఎఫ్ ఆర్ నిధులతో గోదావరిఖని పట్టణం, సెంటినరీ కాలనీ, మంథని ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని వివరించారు.
కార్మికుల చిరకాల కోరిక అయిన ఆదాయపు పన్ను రద్దు అంశాన్ని కూడా కేంద్ర స్థాయిలో ప్రస్తావించామని తెలిపారు. కార్మికుల మారుపేర్ల సమస్య పరిష్కారానికి అధికారులతో పాటు గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులతో కమిటీ ఏర్పాటు చేశామని, ఇందుకు సంబంధించిన విధివిధానాలు ఖరారు చేయాలని కోరినట్లు చెప్పారు.
పవర్ ప్లాంట్ల నుంచి సింగరేణికి రావాల్సిన బకాయిలను విడుదల చేయాలని భట్టి విక్రమార్కను కోరగా, విడతల వారీగా చెల్లించేందుకు అంగీకరించినట్లు పేర్కొన్నారు.గత బీఆర్ఎస్ పాలనలో కొత్త బొగ్గు బ్లాకులు సాధించకపోవడం వల్లే సింగరేణి కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత నైనీ బొగ్గు బ్లాక్‌లో ఉత్పత్తి ప్రారంభించి యాదాద్రి పవర్ ప్లాంట్‌కు బొగ్గు సరఫరా చేస్తున్నామని తెలిపారు. మణుగూరు డీప్‌సైడ్ బొగ్గు బ్లాక్‌తో పాటు తాడిచర్ల బ్లాక్‌ను సింగరేణికి కేటాయించేలా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చిందని పేర్కొన్నారు. కార్మికుల సమస్యలకు పరిష్కారం చూపడమే ఐ ఎన్ టి యు సి లక్ష్యమని, కార్మికుల పక్షాన నిరంతరం పోరాడుతామని స్పష్టం చేశారు. గుర్తింపు సంఘంగా ఉన్న ఏఐటీయూసీ కార్మికుల సమస్యల పరిష్కారంలో విఫలమవుతూ ప్రతి విషయానికి ఐ ఎన్ టి యు సి, కాంగ్రెస్‌ను విమర్శించడం సరికాదన్నారు. కార్మికులు ఐ ఎన్ టి యు సి చేస్తున్న కృషిని గుర్తించాలని కోరారు.
ఈ కార్యక్రమంలో సెంట్రల్ నాయకుడు గడ్డం తిరుపతి యాదవ్, బ్రాంచ్ సెక్రటరీ నరెడ్ల శ్రీనివాసరావు, బ్రాంచ్ అడ్వైజర్ జక్కుల దామోదర్ రావు, అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ ముప్పిడి శ్రీనివాస్, ఆపరేషన్ పిట్ సెక్రటరీ తోకల ప్రవీణ్, సి హెచ్ పి పిట్ సెక్రటరీ కిషన్ నాయక్, భీముని శ్రీనివాస్, గాదె సమ్మయ్య, వేగోళపు చుక్కయ్య, రాజన్న, కొమ్ము ఓదెలు, నూతి శ్రీనివాస్, హేమలత, బొగ్గుల మల్లేష్, పిన్నింటి రాంరెడ్డి, తుంగపిండి ఆనంద్, కాంతాల కిషన్ రెడ్డి, తుంగపిండి నారాయణ, దేవేందర్ రెడ్డి, లెక్కల సమ్మిరెడ్డి, చావన్, రెడ్డపాక రాయమల్లు, ముద్దసాని రమణారెడ్డి, విజయ్ కుమార్, గుమ్మడి అంజి, గుండేటి శ్రీను, భూమయ్య, మల్లేష్, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఆర్.జి-2 ఏరియాలో ఘనంగా ఇంటర్ డిపార్ట్‌మెంట్ అథ్లెటిక్స్ పోటీలు

**సింగరేణి కార్మికుల్లో క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు నిర్వహించిన ఇంటర్ డిపార్ట్‌మెంట్ అథ్లెటిక్స్ పోటీలు ఉత్సాహభరితంగా సాగాయి.**





**యైటింక్లైన్ కాలనీ (జనంసాక్షి)నవంబర్ 2:**
సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ ఆర్.జి-2 ఏరియా ఆధ్వర్యంలో సోమవారం 8 ఇంక్లైన్ కాలనీలోని డాక్టర్ ఏ.పి.జె. అబ్దుల్ కలాం క్రీడా మైదానంలో ఈ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో ఆర్.జి-2 ఏరియా పరిధిలోని వివిధ గనులు, ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టులు, ఇతర విభాగాలకు చెందిన క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించారు.ఈ సందర్భంగా 100, 200, 400, 800, 1500, 5000, 10000 మీటర్ల పరుగు పందేలు, 110 మీటర్లు, 400 మీటర్ల హర్డిల్స్, 3000 మీటర్ల సైకిల్ రేస్, 4100, 4400 మీటర్ల రిలే పోటీలతో పాటు లాంగ్ జంప్, ట్రిపుల్ జంప్, హైజంప్, పోల్ వాల్ట్, షాట్‌పుట్, డిస్కస్ త్రో, హామర్ త్రో, జావెలిన్ త్రో, ఆర్చరీ విభాగాల్లో పోటీలు నిర్వహించారు.వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఆర్.జి-1, ఆర్.జి-2 ఏరియాల మధ్య నిర్వహించనున్న తదుపరి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ సూపర్‌వైజర్ నరేందర్ రెడ్డి, స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ మహ్మద్ అక్రమ్, జనరల్ కెప్టెన్ రవీందర్ రెడ్డితో పాటు పలువురు క్రీడాకారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# గన్నేరువరం మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలి : గంప వేంకన్న డిమాండ్




**గన్నేరువరం, నవంబర్ 2 (జనంసాక్షి):**
గన్నేరువరం మండలంలోని రైతులు ఎదుర్కొంటున్న తీవ్ర కరువు పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గంప వేంకన్న ఆధ్వర్యంలో మండల ఎంపీడీవో కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఎల్‌నినో ప్రభావంతో గన్నేరువరం మండలంలోని అన్ని గ్రామాల్లో ఖరీఫ్ సీజన్‌లో ఆశించిన స్థాయిలో వర్షపాతం నమోదు కాకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పంటలు ఎండిపోయి పెట్టుబడులు చేతికందక రైతులు ఆర్థికంగా నష్టపోయే పరిస్థితి నెలకొందని వారు తెలిపారు.
ఈ సందర్భంగా గంప వెంకన్న మాట్లాడుతూ.. రైతుల కష్టాలను పట్టించుకోకుండా చిత్తశుద్ధి లేని పాలన సాగిస్తున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై విమర్శలు చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి గన్నేరువరం మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలని, రైతులకు నష్టపరిహారం అందించడంతో పాటు అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. “రైతుల సంక్షేమమే మా లక్ష్యం.. రైతులకు న్యాయం జరిగే వరకు మా పోరాటం ఆగదు!” అని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు న్యాత సుధాకర్, గ్రామ శాఖ అధ్యక్షులు మిాసాల ప్రభాకర్, మండల మహిళా అధ్యక్షురాలు కుసుంబ నవీన, కొట్ట భూమయ్య,సమ్మెట అనిల్, బుర్ర శ్రీనివాస్, ఘర్షకుర్తి లక్ష్మణ్,పుల్లెల మల్లయ్య తదితర బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



# నవాబుపేట ముదిరాజ్ కుల సంఘం పెద్దమనిషిగా గుళ్ళ రవి ఎన్నిక

## సంఘం అభివృద్ధితోపాటు సభ్యుల సంక్షేమానికి కృషి చేస్తానని వెల్లడి..



**చిగురుమామిడి నవంబర్ 02(జనంసాక్షి):**
నవాబుపేట ముదిరాజ్ సంఘం అభివృద్ధికి, సంఘం సభ్యుల సంక్షేమానికి నిరంతరం ఐక్యమత్యంతో కృషి చేస్తామని నూతనంగా ఎన్నికైన కుల సంఘం పెద్దమనిషి గుళ్ళ రవి తెలిపారు.కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం నవాబుపేట ముదిరాజ్ సంఘం భవనంలో అధ్యక్షుడు గుళ్ళ బాలయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల్లో ఓటు ద్వారా గుళ్ళ రవిని సోమవారం ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన పెద్దమనిషి గుళ్ళ రవి మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన సంఘం సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. నవాబుపేట ముదిరాజ్ సంఘంలోని 220మంది సభ్యులను ఎల్లప్పుడూ సమన్వయం చేసుకుంటూ,అందరి ఐక్యతతో సంఘం మరింత ముందుకు సాగేలా చూస్తానని అన్నారు.సంఘం అభివృద్ధి సంక్షేమంతో పాటు,గ్రామంలోని ముదిరాజ్ కులదైవం పెద్దమ్మతల్లి ఆలయ సమగ్ర అభివృద్ధికి తన వంతుగా ప్రత్యేక కృషి చేస్తానని ఆయన ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు గుళ్ళ బాలయ్య, సంఘం సభ్యులు నూతన పెద్దమనిషి గుళ్ళ రవికి శాలువా కప్పి ప్రత్యేక అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు గూళ్ల బాలయ్య,సంఘం కార్యదర్శి పిల్లి కొమురయ్య,డైరెక్టర్లు పోలవేణి సంపత్,పిల్లి శ్రీను,పిల్లి వేణు, పిల్లి రమేష్,సంఘం సభ్యులు గుళ్ళ కొమురయ్య,గుళ్ళ కృష్ణ,అనుమండ్ల సత్యనారాయణ,బరిగెల వెంకటేశం,మద్దెల రమేష్,అనుమండ్ల శ్రీను,గుళ్ళ శ్రవణ్,పిల్లి రమేష్,పిల్లి రాజయ్య,గుళ్ళ సమ్మయ్య,గుళ్ళ స్వామి,గుళ్ళ సంతోష్,గుళ్ళ రమేష్,కుంభం వెంకట్రాజయ్య, గుళ్ళ మొండి,కర్నాల వెంకటేశం,బొల్లి రవి,బొల్లి సంపత్,గుళ్ళ రాజు,అప్పీసా కొమురయ్య,సంఘము సభ్యులు పాల్గొన్నారు.

# వైరాలజీ, డ్రగ్ డిస్కవరీపై తెలంగాణ యూనివర్సిటీలో ఆహ్వానిత ఉపన్యాసం

## యాంటీ వైరల్, క్యాన్సర్ నిరోధక ఔషధాల తయారీపై విద్యార్థులకు అవగాహన

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, నవంబర్ 2 (జనంసాక్షి):**

తెలంగాణ యూనివర్సిటీ బయోటెక్నాలజీ విభాగంలో సోమవారం 'మాలిక్యులర్ వైరాలజీ అండ్ డ్రగ్ డిస్కవరీలో కంప్యూటేషనల్ బయాలజీ విధానాలు' అనే అంశంపై ప్రత్యేక ఆహ్వానిత ఉపన్యాసం నిర్వహించారు. పాండిచ్చేరి యూనివర్సిటీ కి చెందిన ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ రజనీష్ అనుపమ్ ఈ ఉపన్యాసాన్ని అందించారు.



ఈ సందర్భంగా ఆయన వైరాలజీకి సంబంధించిన అంశాలు, యాంటీ వైరల్, క్యాన్సర్ నిరోధక ఔషధాల అభివృద్ధి, మాలిక్యులర్ రెగ్యులేషన్, వైరస్‌లు సాధారణ కణాలపై దాడి చేసే విధానాలను వివరించారు. కంప్యూటేషనల్ బయాలజీ ద్వారా ఔషధాల పరిశోధన, అభివృద్ధిలో కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులు, పరిశోధకులతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో పలు శాస్త్రీయ సందేహాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎం. యాదగిరి, డాక్టర్ రజనీష్ అనుపమ్‌ను శాలువా, జ్ఞాపికతో సత్కరించారు. విద్యార్థులు, పరిశోధకులకు శాస్త్రీయ విజ్ఞానాన్ని అందించినందుకు ఆయనను అభినందించారు. కార్యక్రమంలో బయోటెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ మహేందర్ ఐలేని, బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్‌పర్సన్ డాక్టర్ కిరణ్మయి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం. ప్రసన్న షీలా, పార్ట్‌టైమ్ లెక్చరర్ డాక్టర్ ప్రసన్న కుమారి, ఆర్గానిక్ కెమిస్ట్రీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జి. బాలకిషన్, ఎమ్మెస్సీ బయోటెక్నాలజీ విద్యార్థులు, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.



# సాధన సూరుల విన్యాసం

### ప్రేక్షకులను ఆకట్టుకున్న కళాకారులు

**గంభీరావుపేట, నవంబర్ 2.జనంసాక్షి**

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రంలో ఆదివారం రాత్రి సాధన సూరుల విన్యాసాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కళాకారులు తమ ప్రతిభను చాటుతూ చేసిన అద్భుత విన్యాసాలు చూపరులను అబ్బుర పరిచాయి. వారి ప్రదర్శనలకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభించింది. సాంప్రదాయ కళలను కాపాడుతూ భావితరాలకు అందించడంలో కళాకారుల పాత్ర ఎంతో కీలకమని పలువురు పేర్కొన్నారు. సాధన సూరుల విన్యాసాలు కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కళాకారులను పలువురు అభినందించారు. ఇలాంటి సాంప్రదాయ కళా ప్రదర్శనలను మరిన్ని నిర్వహించాలని స్థానికులు ఆకాంక్షించారు.

## విద్యార్థుల బస్సు సమస్యను పరిష్కరించాలి : టీజీవీపీ

**బోధన్, నవంబర్ 2 ( జనంసాక్షి ) :**



బోధన్ నియోజకవర్గం లోని రెంజల్ మండలం కందకుర్తి, పేపర్ మిల్, నీలా, సాటాపూర్ గ్రామాల విద్యార్థులకు ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ తెలంగాణ విద్యార్థి పరిషత్ బోధన్ డివిజన్ కార్యదర్శి మదరోళ్ల నిఖిల్ సోమవారం బోధన్ ఆర్టీసీ డిపో మేనేజర్ విశ్వనాథంకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఉదయం 8:30 గంటలకు కందకుర్తి నుండి బోధన్‌కు, సాయంత్రం 4:30 గంటలకు బోధన్ నుండి కందకుర్తికి ప్రత్యేక బస్సు సర్వీసులు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ గ్రామాల నుండి బోధన్ పట్టణంలోని పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలలకు వెళ్లే విద్యార్థులు ప్రతిరోజూ రవాణా సమస్యలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. విద్యాసంస్థలకు ఆలస్యంగా చేరుకుంటున్నారని పేర్కొన్నారు. విద్యార్థులు ఆలస్యం కాకుండా సమయానికి విద్యా సంస్థలకు చేరుకునేలా ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సు సర్వీసులను ప్రారంభించాలని, విద్యార్థుల సమస్యలను పరిష్కరించేందుకు వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ విద్యార్థి పరిషత్ నాయకులు కోరారు.ఈ కార్యక్రమంలో టీజీవీపీ సభ్యులు అర్ఫత్ ఖాన్, షేక్ ఖాజా మొయినుద్దీన్ తదితరులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# మాధవనగర్ ఆర్వోబీ నిర్మాణ జాప్యంపై అఖిలపక్షం పోరుబాట

## దీపావళి తర్వాత ఎమ్మెల్యేల ఇళ్ల ముట్టడి.. అవసరమైతే నగర బంద్‌కు సిద్ధం

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, నవంబర్ 2 (జనం సాక్షి):**

మాధవనగర్ రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్వోబీ) నిర్మాణ పనుల్లో జరుగుతున్న జాప్యంపై నిజామాబాద్‌లో రాజకీయ వేడి రాజుకుంటోంది. సమస్య పరిష్కారం కోసం అఖిలపక్షం ఉద్యమానికి సిద్ధమైంది. జిల్లా డెవలప్‌మెంట్ ఫోరం ఆధ్వర్యంలో చైర్మన్ బొబ్బిలి నర్సయ్య అధ్యక్షతన నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో 18 రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.ఆర్వోబీ నిర్మాణం ఆలస్యం కావడంతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై నేతలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. నిర్మాణ పనులను వేగవంతం చేసేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని నిర్ణయించారు. తొలుత జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేయడంతో పాటు జిల్లాలోని ఎమ్మెల్యేలందరికీ మెమోరాండాలు సమర్పించనున్నారు. అయినా సమస్య పరిష్కారం కాకపోతే దీపావళి తర్వాత ఎమ్మెల్యేల ఇళ్ల వద్ద ధర్నాలు, ముట్టడి కార్యక్రమాలు చేపట్టాలని సమావేశంలో తీర్మానించారు. అవసరమైతే నగర బంద్‌కు పిలుపునిచ్చి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని నేతలు హెచ్చరించారు.మాధవనగర్ ఆర్వోబీ సమస్య ఒక ప్రాంతానికే పరిమితం కాదని, నగర అభివృద్ధి, ప్రజల రవాణా సౌకర్యాలతో ముడిపడి ఉన్న కీలక అంశమని నేతలు పేర్కొన్నారు. పార్టీలకు అతీతంగా రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, స్వచ్ఛంద సంస్థలు కలిసి పోరాడాలని పిలుపునిచ్చారు.

## ప్రైవేటు ఆసుపత్రుల బిల్లులు, అనుమతులపై కలెక్టర్‌కు ఫిర్యాదు

### ఫార్మసీ, ల్యాబ్ బిల్లుల వసూళ్లపై విచారణ జరపాలి : కోట శ్యామ్‌కుమార్

**కరీంనగర్ టౌన్, నవంబర్ 02, (జనంసాక్షి):**



నగరంలోని ప్రైవేటు ఆసుపత్రుల్లో ఫార్మసీ, ల్యాబ్ బిల్లులను ఇష్టానుసారంగా వసూలు చేస్తున్నారని, సరైన అనుమతులు లేకుండానే కొన్ని ఆసుపత్రులు నిర్వహిస్తున్నారని కరీంనగర్ భారతీయుడు కోట శ్యామ్ కుమార్ ఆరోపించారు. ఈ మేరకు సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆసుపత్రుల్లో అవసరం లేకున్నా అధిక మొత్తంలో ఫార్మసీ, ల్యాబ్ బిల్లులు వేస్తూ రోగులపై ఆర్థిక భారం మోపుతున్నారని పేర్కొన్నారు. నగరంలోని కొన్ని ఆసుపత్రులు అవసరమైన అనుమతులు లేకుండానే కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు ఆరోపించారు. ఆసుపత్రుల పార్కింగ్ సదుపాయాలు, అగ్నిమాపక భద్రతా ఏర్పాట్లు, భవన నిర్మాణ అనుమతులతో పాటు ఇతర లైసెన్సులపై అధికారులు సమగ్రంగా తనిఖీలు నిర్వహించాలని కోరారు.నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ఆసుపత్రులను గుర్తించి, వాటి లైసెన్సులు రద్దు చేయడంతో పాటు అవసరమైతే ఆసుపత్రులను సీజ్ చేయాలని కలెక్టర్‌ను విజ్ఞప్తి చేశారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోట శ్యామ్‌కుమార్ కోరారు.



# రైతులు ధాన్యాన్ని కనీస మద్దతు ధరకే విక్రయించాలి

### పీపీసీ కేంద్రాలను సందర్శించి రైతులకు అవగాహన

**కల్పించిన అచ్చంపేట సహకార సంఘం చైర్మన్ జనార్ధన్ రెడ్డి**

**నిజాంసాగర్ (జనంసాక్షి):**

అచ్చంపేట సహకార సంఘం పరిధిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను (పీపీసీ) సోమవారం సహకార సంఘం చైర్మన్ జనార్ధన్ రెడ్డి సందర్శించి రైతులకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధరకు మాత్రమే రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు విక్రయించాలని సూచించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చే ప్రతి రైతు తప్పనిసరిగా ధాన్యాన్ని శుభ్రపరిచి, చెత్తా చెదారం లేకుండా నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా సిద్ధం చేసుకోవాలని వివరించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం శుభ్రం చేయని ధాన్యాన్ని కొనుగోలు చేయడం సాధ్యం కాదని రైతులకు స్పష్టం చేశారు. రైతులు ఈ నిబంధనలను పాటించి సహకార సంఘానికి నాణ్యమైన ధాన్యాన్ని అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో చైర్మన్ జనార్ధన్ రెడ్డితో పాటు మానిటరింగ్ అధికారి విఠల్, అచ్చంపేట గ్రామ సర్పంచ్ లక్ష్మయ్య, సంఘ కార్యదర్శి సంగమేశ్వర్ గౌడ్, సహకార సంఘం డైరెక్టర్లు, రైతులు, సంఘ సిబ్బంది పాల్గొన్నారు.



# ఎస్ఐఆర్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలి

### రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి నవంబర్ 02 జనం సాక్షి:**

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి సూచించారు. సోమవారం హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ, ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని తెలిపారు. నూతన ఓటరు నమోదు, సవరణలు/మార్పులు, తొలగింపుల కొరకు ఫారం 6, 7, 8 ద్వారా అందిన దరఖాస్తుల పరిశీలన వేగవంతం చేయాలని సూచించారు. ఓటరు జాబితా నుండి తొలగించిన ప్రతి ఓటరును, తొలగించడానికి గల కారణాలను స్పష్టంగా నమోదు చేయాలని, స్వీప్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులచే వ్యాసరచన, రంగోలి పోటీలు నిర్వహించి బహుమతులు అందజేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు.వీ.సీలో పాల్గొన్న సందర్భంగా అదనపు కలెక్టర్ రాజాగౌడ్ మాట్లాడుతూ, ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భుజంగరావు, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు బాలరాజు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ముస్తఫా నగర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

## రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి: సర్పంచ్ సుకన్య

**గంభీరావుపేట, నవంబర్ 2, జనంసాక్షి:**
రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం ముస్తఫా నగర్ గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం గ్రామ సర్పంచ్ బండ సుకన్య దేవయ్య, సింగిల్ విండో చైర్మన్ వేషాల వెంకటి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. సన్న రకం ధాన్యానికి ప్రభుత్వం క్వింటాలుకు రూ. 500 బోనస్ అందిస్తుందని తెలిపారు. రైతులందరూ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ సుకన్య కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ హమీద్, వైస్ చైర్మన్ మేడ భాస్కర్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు పర్వ



హనుమాన్లు, ఉపసర్పంచ్ శివంది దేవేందర్, జిల్లా అంబేద్కర్ సంఘం ఉపాధ్యక్షుడు బండ రమేష్, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు దేవేందర్, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు నర్సింగరావు, వార్డు సభ్యులు దోమకొండ కృష్ణకాంత్ యాదవ్, చెరుపెల్లి సరస్వతి, సింగిల్ విండో డైరెక్టర్లు, నాయకులు కొక్కు దేవేందర్ యాదవ్, ప్రసాద్ రావు, శివంది శ్రీను, సీఈవో రాజిరెడ్డి, సిబ్బంది నాగరాజు, రైతులు, హమాలీలు పాల్గొన్నారు.

# ఇంజినీరింగ్‌లో డాక్టరేట్ సాధించిన యెదులాపురం రంజిత్ కుమార్

## 17 అంతర్జాతీయ పరిశోధనా వ్యాసాల ప్రచురణతో అరుదైన ఘనత

**హుజూరాబాద్, నవంబర్ 2 (జనంసాక్షి):**



హుజూరాబాద్‌కు చెందిన యెదులాపురం రామబ్రహ్మం (రిటైర్డ్ ఉపాధ్యాయుడు) కుమారుడు యెదులాపురం రంజిత్ కుమార్ ఇంజినీరింగ్ విభాగంలో డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ (పీహెచ్‌డీ) పట్టా సాధించారు. ప్రతిష్ఠాత్మక అకాడమీ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇన్నోవేటివ్ రీసెర్చ్ సంస్థ నుంచి ఈ పట్టాను పొందారు. పరిశోధనా సంస్థల విభాగంలో ఈ సంస్థ ఎన్ఐఆర్ఎఫ్ జాతీయ ర్యాంకింగ్స్‌లో తొమ్మిదో స్థానంలో నిలిచింది. హైదరాబాద్‌లోని జాతీయ పరిశోధనా సంస్థ సీఎస్ఐఆర్?ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (CSIR-IICT)లో యూజీసీ-నెట్ జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ (JRF) సహకారంతో ఆయన డాక్టరల్ పరిశోధన పూర్తి చేశారు. నానోస్ట్రక్చర్డ్ ఐరన్ ఆక్సైడ్లు, ఎంట్రోపీ-ఇంజినీర్డ్ స్పినెల్ ఫెర్రైట్ల తయారీ, విశ్లేషణతో పాటు అయస్కాంత, శక్తి నిల్వ అనువర్తనాలపై ఆయన పరిశోధన సాగింది. ఈ పరిశోధనల ఫలితంగా ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ పీర్-రివ్యూడ్ జర్నల్స్‌లో 17 పరిశోధనా వ్యాసాలు ప్రచురితమయ్యాయి. రంజిత్ కుమార్ సాధించిన ఈ విజయం హుజూరాబాద్ ప్రాంతానికి గర్వకారణంగా నిలిచింది. ఆయనకు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, స్థానికులు అభినందనలు తెలిపారు.

# పుష్కర వేళ ధర్మపురికి చారిత్రక శోభ

## చింతామణి చెరువు కట్టపై కవి శేషప్ప కాంస్య విగ్రహం ఏర్పాటు చేయాలి!

**న్యాయవాది కూర్మాచలం ఉమామహేష్**



**ధర్మపురి (నవంబర్ 2) జనం సాక్షి**
దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రం ధర్మపురిలో రానున్న గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకొని పట్టణాన్ని సమగ్రంగా సుందరీకరించాలని, అందులో భాగంగా చారిత్రక నేపథ్యం ఉన్న చింతామణి చెరువు కట్టపై ప్రముఖ భక్త కవి కాకుత్థం శేషప్ప కవి విగ్రహాన్ని ఘనంగా ప్రతిష్టించాలని న్యాయ విద్యార్థుల సంఘం గౌరవ అధ్యక్షులు, న్యాయవాది కూర్మాచలం ఉమామహేష్ ప్రభుత్వాన్ని, జిల్లా యంత్రాంగాన్ని కోరారు. ఈ సందర్భంగా న్యాయవాది ఉమా మహేష్ మాట్లాడుతూ... ధర్మపురి నరసింహ శతకం, నృకేసరి శతకాలను రచించి తెలుగు సాహిత్య రంగానికి, ఆధ్యాత్మిక రంగానికి విశేష సేవలందించిన మహనీయుడు శేషప్ప అని కొనియాడారు. హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై కొలువైన బుద్ధ విగ్రహం తరహాలోనే ధర్మపురి నడిబొడ్డున ఉన్న చింతామణి చెరువు మధ్యలో లేదా కట్టపై ఆహ్లాదకరమైన వాతావరణంలో శేషప్ప భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. చెరువు కట్ట వెంట ఫుట్‌పాత్, సుందరమైన విద్యుద్దీపాలు, పచ్చదనం, కూర్చోవడానికి బెంచీలు ఏర్పాటు చేస్తే పట్టణవాసులకు మార్నింగ్ వాకింగ్‌కు, యాత్రికులకు ఆహ్లాదకరమైన విడిది కేంద్రంగా మారుతుందన్నారు. పుష్కరాల సమయానికి దేశవిదేశాల నుంచి లక్షలాది మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున, ఇది ధర్మపురి సాంస్కృతిక వైభవానికి నిదర్శనంగా నిలవడమే కాకుండా పర్యాటక రంగంలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని పేర్కొన్నారు.ప్రభుత్వం, పర్యాటక శాఖ, స్థానిక ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవ తీసుకొని పుష్కర నిధులతో ఈ సుందరీకరణ ప్రాజెక్టును త్వరితగతిన పట్టాలెక్కించాలని ఉమామహేష్ విజ్ఞప్తి చేశారు.



# గ్రామాల్లో ఐకెపి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

ముస్తాబాద్ నవంబర్ 02 జనం సాక్షి
పోతుగల్ ఏఎంసీ చైర్మన్ ఆరుట్ల మహేష్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏళ్ల బాల్ రెడ్డి ఆయా గ్రామ సర్పంచులు ఉప సర్పంచ్లు ఏఎంసి డైరెక్టర్లతో కలిసి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినారు. ఈ సందర్భంగా రైతులు తమ వరి ధాన్యాన్ని మద్దతు ధరకు విక్రయించి కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని పోతుగల్ ఏఎంసి చైర్మన్ అరుట్ల మహేష్ రెడ్డి పిలుపునిచ్చారు..
కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పెద్దపీట..
రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు నిర్వహించాలని వెల్లడి. ఈ కార్యక్రమంలో ఏ ఎం సి వైస్ చైర్మన్ సడిమెల ఆయా గ్రాముల సర్పంచులు ఉపసర్పంచ్లు ఏఎంసీ డైరెక్టర్లు మహిళా సంఘాలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఐకెపి అధికారులు రైతులు తదితరులు పాల్గొన్నారు .

# మండల అభివృద్ధి ఐక్య వేదిక అధ్యక్షుడిగా సావనపెల్లి రాకేష్ ఏకగ్రీవ ఎన్నిక



**ఇల్లంతకుంట నవంబర్ 02(జనంసాక్షి )**
ఇల్లంతకుంట మండల కేంద్రంలోని వైశ్యభవన్‌లో ఏనుగుల లింగన్న ఆధ్వర్యంలో రాజకీయాలకు అతీతంగా మండల అభివృద్ధి ఐక్య వేదిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడిగా సావనపెల్లి రాకేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.
కమిటీ ఉపాధ్యక్షుడిగా బత్తిని భూమేష్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా గరిగే శ్రీనివాస్, కోశాధికారిగా గజ్జల దేవరాజు, సంయుక్త కార్యదర్శిగా న్యాత అశోక్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా భూత్కూరి వినోద్, కార్యవర్గ సభ్యుడిగా మామిడి విజయ్‌ను ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా అధ్యక్షుడు రాకేష్ మాట్లాడుతూ.. మండలంలోని ప్రజా సమస్యల పరిష్కారమే ఐక్య వేదిక ప్రధాన లక్ష్యమని తెలిపారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, మహాత్మా జ్యోతిరావు పూలే, ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాల స్ఫూర్తితో, రాజ్యాంగ విలువలైన సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం ఆధారంగా ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతామని పేర్కొన్నారు.నవంబర్ 26న రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఇల్లంతకుంటలో కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రత్యేక సభ నిర్వహించి ప్రజలకు రాజ్యాంగ హక్కులపై అవగాహన కల్పిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో టీడీపీ కరీంనగర్ పార్లమెంట్ నాయకులు అన్నాడి నరేందర్ రెడ్డి, గజబీంకార్ ఎల్లోజీ, బత్తిని భూమేష్ గౌడ్, గరిగే శ్రీనివాస్, మల్లమారి బాబు, భూత్కూరి వినోద్, గజ్జల దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

# బీఎంఎస్‌లోకి భారీగా కార్మికుల చేరికలు

## సింగరేణిలో గుర్తింపు సంఘంగా బీఎంఎస్‌ను నిలబెట్టడమే లక్ష్యం : వడ్డేపల్లి కుమారస్వామి

**మైటింక్లైన్ కాలనీ (జనంసాక్షి)నవంబర్ 2:**
సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ (బీఎంఎస్)లోకి రామగుండం రీజియన్‌కు చెందిన పలువురు కార్మికులు ఆదివారం భారీగా చేరారు. గోదావరిఖనిలోని బీఎంఎస్ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆర్జీ-1, ఆర్జీ-2 ఏరియాలకు చెందిన కార్మికులు బీఎంఎస్ విధానాలకు ఆకర్షితులై యూనియన్‌లో చేరారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వడ్డేపల్లి కుమారస్వామి వారికి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా వడ్డేపల్లి కుమారస్వామి మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో సింగరేణిలో బీఎంఎస్‌ను మరింత బలోపేతం చేసి, తదుపరి గుర్తింపు సంఘం ఎన్నికల్లో విజయం సాధించడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్మికుల హక్కుల సాధన, సంక్షేమం, సింగరేణి సంస్థ పరిరక్షణే ధ్యేయంగా బీఎంఎస్ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు.రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి సంస్థకు చెల్లించాల్సిన సుమారు రూ.56 వేల కోట్ల బకాయిలను తక్షణమే చెల్లించాలని



డిమాండ్ చేశారు. సంస్థలో దీర్ఘకాలంగా పరిష్కారానికి నోచుకోని కార్మిక సమస్యల పరిష్కారం కోసం బీఎంఎస్ ఆధ్వర్యంలో త్వరలోనే 'పోరుబాట యాత్ర' చేపట్టనున్నట్లు వెల్లడించారు. కార్మికుల సమస్యలపై యాజమాన్యం, ప్రభుత్వాల దృష్టిని ఆకర్షించి, న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని తెలిపారు.ఈ సందర్భంగా ఆర్జీ-1, ఆర్జీ-2 ఏరియాలకు చెందిన పురుమ సత్యనారాయణ, మేడి నగేష్, దెబ్బట కిరణ్, పిట్ట శ్రీనివాస్, వందన అఖిల్, మెట్టు రాములు, రంగినేని రవికుమార్ తదితరులు బీఎంఎస్‌లో చేరారు.ఈ కార్యక్రమంలో కేంద్ర ఉపాధ్యక్షులు వై. సారంగపాణి, అరుకాల ప్రసాద్, కేంద్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ఆకుల హరిన్, కోశాధికారి సాయవేణి సతీష్, మాదాసు రవీందర్, మూడు ఏరియాల ఉపాధ్యక్షులు కర్రావుల మహేష్, గట్టు శ్రీనివాస్, రౌతు రమేష్ తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో కార్మికులు, బీఎంఎస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# కిష్టంపేట్ లో ప్రమాదవశాత్తు చెట్టు పైనుండి కాలుజారి కిందపడి వ్యక్తి మృతి

**వీణవంక నవంబర్ 2 (జనం సాక్షి)**



వీణవంక మండలంలోని కిష్టంపేట్ గ్రామానికి చెందిన బోయినీ రాయమల్లు,55 సం,ఇదే గ్రామానికి చెందిన కల్లేపల్లి మదనయ్యకు చెందిన భూమిలోని టేకు చెట్ల కొమ్మలను కొట్టేందుకు తేదీ 31-10-2026 రోజున ఉదయం కూలీ పనికి పిలువగా మృతుడు రాయమల్లు టేకు చెట్లు ఎక్కి కొమ్మలను కొడుతున్నాడు.ఈ క్రమంలో మధ్యాహ్నం సుమారు 3:00 గంటల సమయంలో ప్రమాదవశాత్తు చెట్టుపై నుండి కాలుజారి కిందపడటంతో తలకు తీవ్ర రక్తగాయాలు శరీరంలోని ఇతర భాగాలకు గాయాలయ్యాయి.వెంటనే అతనిని108 అంబులెన్స్ ద్వారా జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా,అక్కడి నుండి మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌లోని హంస హాస్పిటల్‌కు తరలించి చికిత్స పొందుతూ 01-11-2026 ఆదివారం రోజున మధ్యాహ్నం 2:32 గంటలకు బోయిన్ రాయమల్లు మృతి చెందాడు. మృతుని కుమారుడు బోయిని కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వీణవంక ఎస్ఐ ఆవుల తిరుపతి తెలిపారు.

# జర్నలిస్ట్ పెండ్యాల రామ్ కుమార్ అంతిమ యాత్ర

## శోకసంద్రమైన మంథని



**మంథని, నవంబర్ 02, (జనంసాక్షి) :**
పెద్దపల్లి జిల్లా మంథని సీనియర్ జర్నలిస్ట్ పెండ్యాల రామ్ కుమార్ (47) అంతిమయాత్ర సోమవారం అశ్రు నయనాల మధ్య కొనసాగింది. అనారోగ్యంతో మృతి చెందిన ఆయన పార్థివదేహానికి మంథని పట్టణం నుండి గోదావరి తీరం వరకు జర్నలిస్టులు, బంధువులు, స్నేహితులు భారీ సంఖ్యలో తరలివచ్చి ఘనంగా నివాళులు అర్పించారు. రామ్ కుమార్ స్వగృహం నుండి ప్రారంభమైన అంతిమయాత్ర మంథని ప్రధాన వీధుల మీదుగా గోదావరి తీరం వరకు సాగింది. దారి పొడవునా "పెండ్యాల రామ్ కుమార్ అమర్ రహే" అంటూ నినాదాలు మార్మోగాయి. ఆయనను కడసారి చూసేందుకు వ్యాపార, వాణిజ్య, రాజకీయ ప్రముఖులు, వివిధ జర్నలిస్ట్ సంఘాల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. రామ్ కుమార్ విద్యార్థి దశ నుంచే సామాజిక ఉద్యమాల్లో కీలకంగా పనిచేసి, సుదీర్ఘ కాలం పాటు మంథని కేంద్రంగా వివిధ పత్రికల్లో జర్నలిస్టుగా పనిచేశారు. పేద ప్రజల గొంతుకగా నిలిచి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడారు. నిజాయితీ, నిర్భయ జర్నలిజానికి ఆయన నిలువెత్తు నిదర్శనం. ఆయన మృతి జర్నలిస్ట్ లోకానికి తీరని లోటని, ఆయన సేవలు మరువలేనివని పలువురు జర్నలిస్టులు కన్నీటి పర్యంతమయ్యారు. మంథని ప్రెస్ క్లబ్ తరపున ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. గోదావరి తీరంలో లాంఛనాలతో అంత్యక్రియలు పూర్తి చేశారు. మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు, మంథని, రామగిరి, కమాన్ పూర్, ముత్తారం, పెద్దపల్లి, కరీంనగర్ మండలాల జర్నలిస్టులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, న్యాయవాదులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొని అశ్రు నివాళులు అర్పించారు.



## పోతిరెడ్డిపల్లి - హిమ్మత్‌నగర్ క్రాస్ రోడ్డు మరమ్మతులు

## త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్‌కు వినతి

### సర్పంచ్ గజ్జల మొగిలయ్య

**వీణవంక నవంబర్ 2 (జనంసాక్షి)**
వీణవంక మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామం నుండి హిమ్మత్‌నగర్ గ్రామ క్రాస్ వరకు రెండు గ్రామాలకు చెందిన రహదారి పూర్తిగా దెబ్బతిని ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో రోడ్డు మరమ్మతులను వెంటనే చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలని కోరుతూ పోతిరెడ్డిపల్లి గ్రామ సర్పంచ్ గజ్జల మొగిలయ్య ఆధ్వర్యంలో ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ వినతిపత్రం సమర్పించడం జరిగింది.ఈ వినతిపై జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించి, సంబంధిత అధికారులకు వెంటనే సమాచారం అందించి,రోడ్డు మరమ్మతుల పనులను త్వరగా పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుంటానని తెలియజేసినారు.సర్పంచ్ గజ్జల మొగిలయ్య మాట్లాడుతూ నన్ను నమ్ముకుని ప్రజలు ఓట్లేసి సర్పంచ్ గా గెలిపించినందుకు గ్రామంలో ఏ సమస్య అయినా నా సమస్యగా గ్రామ ప్రజా సమస్యలే పరిష్కారమే లక్ష్యంగా గ్రామ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తామని ఈ సందర్భంగా వారు అన్నారు. ఈ కార్యక్రమంలో పోతిరెడ్డిపల్లి గ్రామ సర్పంచ్ గజ్జల మొగిలయ్య,తోపాటు గ్రామ వార్డు మెంబర్లు ఐలవేణి కుమారస్వామి,నరుకుడి రమేష్,గెల్లు అశోక్,కొలిశెట్టి సుమన్ పాల్గొన్నారు.

# బీఎంఎస్‌లోకి భారీగా చేరికలు

**◆ సింగరేణిలో గుర్తింపు సంఘంగా బీఎంఎస్‌ను నిలబెట్టడమే లక్ష్యం..**
**◆ బిఎంఎస్ ప్రధాన కార్యదర్శి వడ్డేపల్లి కుమారస్వామి..**

**గోదావరిఖని, జనంసాక్షి :**
స్థానిక బీఎంఎస్ కేంద్ర కార్యాలయంలో రామగుండం రీజియన్‌లోని 1, 2 ఏరియాలకు చెందిన పలువురు కార్మికులు బీఎంఎస్ విధానాలకు ఆకర్షితులై సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్‌లో చేరారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వడ్డేపల్లి కుమారస్వామి వారికి యూనియన్ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా వడ్డేపల్లి కుమారస్వామి మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో సింగరేణిలో బీఎంఎస్‌ను మరింత బలోపేతం చేసి, తదుపరి గుర్తింపు సంఘం ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్మికుల హక్కుల సాధన, సంక్షేమం, సంస్థ పరిరక్షణే ధ్యేయంగా బీఎంఎస్ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు.రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి చెల్లించాల్సిన సుమారు రూ.56 వేల కోట్ల బకాయిలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. సంస్థలో దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న కార్మిక సమస్యల పరిష్కారం కోసం బీఎంఎస్ ఆధ్వర్యంలో త్వరలో 'పోరుబాట యాత్ర' చేపట్టనున్నట్లు వెల్లడించారు. కార్మికుల సమస్యలపై యాజమాన్యం, ప్రభుత్వాల దృష్టిని ఆకర్షించి న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో అర్జీ 1,2 కు చెందిన పురుమ సత్యనారాయణ, మేడి నగేష్, దెబ్బట కిరణ్, పిట్ట శ్రీనివాస్, వందన అఖిల్, మెట్టు రాములు, రంగినేని రవికుమార్ తదితరులు బీఎంఎస్‌లో చేరారు.ఈ కార్యక్రమంలో కేంద్ర ఉపాధ్యక్షులు వై. సారంగపాణి, అరుకాల ప్రసాద్, కేంద్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ఆకుల హరిన్, కోశాధికారి సాయవేణి సతీష్, మాదాసు రవీందర్, మూడు ఏరియాల ఉపాధ్యక్షులు కర్రావుల మహేష్, గట్టు శ్రీనివాస్, రౌతు రమేష్ తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో కార్మికులు, బిఎంఎస్ ప్రతినిధులు పాల్గొన్నారు.





## వార్డ్ మెంబర్ల ఫోరం అధ్యక్షునికి సన్మానం

**కమాన్ పూర్ నవంబర్ 02, (జనంసాక్షి) :**
పెద్దపల్లి జిల్లా కమాన్ పూర్ మండలం గుండారం గ్రామంలో సోమవారం కమాన్ పూర్ మండల వార్డు మెంబర్ల ఫోరం గౌరవ అధ్యక్షులు దామెర దేవయ్య ఆధ్వర్యంలో తెలంగాణ వార్డ్ మెంబర్ల ఫోరం జిల్లా ఇన్చార్జి తప్పట్లా మోహన్ కి, కమాన్ పూర్ మండల వార్డ్ మెంబర్ల ఫోరం అధ్యక్షులు ఇరుగురాల పరమేశ్వర్ లకు గుండారం గ్రామపంచాయతీ ఆవరణంలో సన్మాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో మండల వార్డు మెంబర్ల ఫోరం ఉపాధ్యక్షులు బొడ్డు రవీందర్, గ్రామ వార్డ్ సభ్యులు పాల్గొన్నారు.

# ప్రజా సేవలో పోలీసుల మానవత్వం

## విధి నిర్వహణలో నిబద్ధత పోలీసుల అసలైన లక్షణాలు

### కానిస్టేబుల్ ప్రశాంత్, హోంగార్డు శ్రీనివాస్ లకు ప్రోత్సాహకాలు, ప్రశంసా పత్రాలు అందజేత

**సిరిసిల్ల టౌన్ నవంబర్ 2 (జనంసాక్షి)**
పజల రక్షణే లక్ష్యంగా విధులు నిర్వహించడంతో పాటు, ఆపదలో ఉన్న వారికి ఆపన్నహస్తం అందించడం కూడా పోలీసుల ప్రధాన బాధ్యత అని జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే అన్నారు.ఇటీవల ఎల్లారెడ్డిపేట మండలంలోని మొదటి బైపాస్ రోడ్డుపై ఫిట్స్ వచ్చి అపస్మారక స్థితిలో పడిపోయిన మహిళకు తక్షణ సహాయం అందించి, మానవత్వం చాటుకున్న బ్లూకోట్ కానిస్టేబుల్ ప్రశాంత్, హోంగార్డు శ్రీనివాస్ చారిలకు సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ప్రోత్సాహకాలు, ప్రశంసా పత్రాలు అందజేసి ప్రత్యేకంగా అభినందించారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసుల విధులు కేవలం శాంతిభద్రతల పరిరక్షణకే పరిమితం కాకుండా, ఆపదలో ఉన్న ప్రజలకు అండగా నిలిచి, అవసరమైన సమయంలో తక్షణ సహాయం అందించడం కూడా పోలీసుల ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది మానవత్వం, సేవాభావం, నిబద్ధతతో విధులు నిర్వహించాలని సూచించారు. విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉంటూ, సమయస్ఫూర్తితో స్పందించి ప్రజలకు మెరుగైన సేవలందించే సిబ్బందిని ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తామని తెలిపారు.పోలీస్ శాఖ ప్రతిష్టను పెంపొందించేలా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు.






## అమిత్ షా మహా పాదయాత్రలో
# ఎమ్మెల్యే ధన్ పాల్

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి నవంబర్ 2 జనంసాక్షి:**
ఇందూరు: హైదరాబాదులో కేంద్ర హోమ్ శాఖ మంత్రి అమిత్ షా సోమవారం చేపట్టిన మహా పాదయాత్రలో నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ పాల్గొన్నారు. ఆయనతో కలిసి నిజాం కళాశాల నుంచి మోజాంజాహీ మార్కెట్ వరకు నడిచారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా భాగ్యనగరానికి రావడంతో తెలంగాణ బీజేపీలో ఉత్సాహం ఉరకలెత్తిందన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వం రావడం ఖాయమన్నారు. ఎస్ ఐఆర్ పై రాహుల్ గాంధీ అబద్ధపు ప్రచారాలను తిప్పికొట్టేందుకే అమిత్ షా భాగ్యనగరానికి విచ్చేశారన్నారు.

## జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో
# విద్యార్థినికి కాంస్య పతకం



**సిరికొండ, నవంబర్ 02 (జనంసాక్షి):**
సిరికొండ సత్యశోధక్ పాఠశాలకు చెందిన విద్యార్థిని అగ్యారం యుగేశ్వరి జాతీయ స్థాయి మినీ సబ్ జూనియర్ అండర్-13 సాఫ్ట్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో తెలంగాణ జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించి కాంస్య పతకం సాధించినట్లు ప్రిన్సిపల్ రావుట్ల నర్సయ్య తెలిపారు. మహారాష్ట్రలోని కోపర్‌గావ్‌లో సంజీవని యూనివర్సిటీలో ఈ నెల 28 నుంచి 31 వరకు నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో తెలంగాణ జట్టు తరఫున పాల్గొని ప్రతిభను చాటి కాంస్య పతకం సాధించడం సంతోషంగా ఉందని అన్నారు. నిజామాబాద్ జిల్లాకు గర్వకారణంగా నిలిచిందని పేర్కొన్నారు. విద్యార్థిని కృషి, పట్టుదల, క్రీడా నైపుణ్యానికి నిదర్శనమని ,విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించేలా పాఠశాల నిరంతరం ప్రోత్సహిస్తుందని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి ఈ ప్రాంతానికి, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

## మానవ హక్కుల నేర నియంత్రణ మండలి సంస్థ
## రాష్ట్ర అధ్యక్షుడుగా శ్రీరామ్ వెంకటేష్ నియామకం



**భిక్కనూరు నవంబర్ 02 (జనంసాక్షి)**
భిక్కనూరు మండల కేంద్రానికి చెందిన పార్టీ యువజన మండల అధ్యక్షుడు వారిసేవలు సామాజిక బాధ్యత ప్రజా సమస్యల పట్లఉన్న బాధ్యతను గుర్తించి.ఈకీలక బాధ్యతలు అప్పగించినట్లు తెలిసింది, నేషనల్ హ్యూమన్ రేట్స్ మరియు యాంటీ క్రైమ్ కంట్రోల్ కౌన్సిల్ ఇండియా ఫౌండేషన్. తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా శ్రీరామ్ వెంకటేష్ నియమితులయ్యారు. ఈమేరకు సంస్థ ఆయనకు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా శ్రీరామ్ వెంకటేష్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించిన సంస్థ జాతీయ నాయకత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ సమాజంలో మానవ హక్కుల పరిరక్షణ సామాజిక న్యాయం సమానత్వం కోసం నిరంతర కృషి చేస్తుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. అదేవిధంగా సమాజంలో మహిళలకు, చిన్నారులకు, పేద బలహీన వర్గాలు, వారి హక్కుల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటూ, ప్రజలలో మానవ హక్కులపై చైతన్యం తీసుకువసానని పేర్కొన్నారు. మానవ హక్కుల పై ప్రజల్లో అవగాహన కల్పించడం బలహీన వర్గాలకు అండగా నిలవడం బాధితులకు న్యాయం నందాల కృషి చేయడం తన ప్రధాన లక్ష్యమని ఆయన వెల్లడించారు. సంస్థ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ప్రజా సేవకు అంకితభావంతో పనిచేస్తానని తెలిపారు.



## నట్టల నివారణ మందుల పంపిణీ

**పెద్ద కొడప్గల్ నవంబర్ 02 (జనంసాక్షి):**
పెద్ద కొడప్గల్ మండలంలోని కాటేపల్లి గ్రామంలో సోమవారం పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో దూడలకు నట్టల నివారణ మందులను వేసినట్లు గోపాలమిత్ర రవీందర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 26 ఆవు దూడలకు, 29 గేదె దూడలకు నట్టల నివారణ మందులు వేసినట్లు తెలిపారు. ఇందులో గోపాలమిత్ర రవీందర్, ఓఎస్ సురేష్, పాడి రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## కబడ్డీ టోర్నమెంట్ ప్రారంభించిన ఎంఈఓ

**పెద్ద కొడప్గల్ నవంబర్ 02 (జనంసాక్షి):**
పెద్ద కొడప్గల్ మండల కేంద్రంలోని పిఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం జోనల్ లెవెల్ కబడ్డీ టోర్నమెంట్ ను ఎంఈఓ ప్రవీణ్ కుమార్ ప్రారంభించారు. పిట్లం, నిజాంసాగర్, పెద్ద కొడప్గల్ మండలాల నుంచి క్రీడాకారులు హాజరై తమ ప్రతిభను కనబరిచారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కమల, వడ్లం ప్రధానోపాధ్యాయులు వల్లభ రావు, సీనియర్ ఉపాధ్యాయులు డాక్టర్ నాగనాథ్, కిషోర్, సుదర్శన్ రెడ్డి, తదితరులు ఉన్నారు.



# ప్రజావాణికి ఆరు ఆర్జీలు

**పెద్ద కొడప్గల్ నవంబర్ 02 (జనంసాక్షి):**
పెద్ద కొడప్గల్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి ఆరు ఆర్జీలు వచ్చినట్లు తహశీల్దార్ రాజశేఖర్ తెలిపారు. సంబంధిత శాఖ అధికారులు వెంటనే పరిష్కరించాలని సూచించారు. శివాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇండ్లకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలని, ఎస్సీ కాలనీలో ఇందిరమ్మ ఇళ్లపై నుంచి వెళ్తున్న విద్యుత్ లైన్ వల్ల ప్రమాదం పొంచి ఉందని, అక్కడి నుండి సమీపంలో మార్పు చేయాలని సర్పంచ్ ఉత్తమ్ రావ్ కోరారు. సముందర్ తాండ గ్రామంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి సంబంధించిన పొజిషన్ సర్టిఫికెట్ ఇవ్వాలని, బూరుగు పల్లి శివారులోని 63, 75 సర్వేనెంబర్ హద్దులు చూపించాలని, మన్సారాం తండాలో అంగన్వాడి భవనం నిర్మాణానికి స్థలం కేటాయించాలని సర్పంచ్ హరిక గోపాల్ సింగ్ కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ షరీఫ్, విద్యుత్ శాఖ ఏఈ సాయినాథ్ గౌడ్, ఏపీఓ సుదర్శన్, ఎంపీడీవో కార్యాలయం పర్యవేక్షకులు రంజిత్ కుమార్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ గోపాల్, ఐకెపి సీసీ అంజయ్య ఉన్నారు.





## ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు కృషి చేయాలి
### పెద్దపల్లి ఇంటర్మీడియట్ విద్యాధికారిని దాసరి కల్పన

**మంథని నవంబర్ 02, (జనంసాక్షి) :**
కళాశాలలో ఉత్తీర్ణత శాతాన్ని పెంపొందించేందుకు అధ్యాపకులు కృషి చేయాలని పెద్దపెల్లి జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారిని దాసరి కల్పన అన్నారు. సోమవారం పెద్దపల్లి జిల్లా మంథని పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తరగతి గదులు పరిశీలించి విద్యార్థుల సామర్థ్యాల పెంపకంపై అధ్యాపకులు తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల నోటు పుస్తకాలను తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు శాతం కచ్చితంగా ఎఫ్ఆర్ఎస్ లో నమోదు చేయాలని, ప్రతి ఒక్కరూ కళాశాలకు సకాలంలో హాజరయ్యేలా చూడాల్సిన బాధ్యత అధ్యాపకులపై ఉందన్నారు. ఈనెల చివరిలోగా పాఠ్యాంశాలను పూర్తి చేసి డిసెంబర్ నుండి రివిజన్ ప్రారంభించాలని సూచించారు. కళాశాల విద్యార్థులకు ప్రభుత్వం అనేక సౌకర్యాలను కల్పించిందని, యూనిఫాం నోటు పుస్తకాలు బ్యాగు షూలు , ఉదయం అల్పాహారంతో పాటు మధ్యాహ్నం రుచికరమైన భోజనం కూడా అందిస్తున్నామన్నారు. డ్రాప్‌ఔట్ల సంఖ్య తగ్గించి ఎక్కువ మంది విద్యార్థులు తరగతిలో ఉండేలా చూడాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులతో నిరంతరం మాట్లాడుతూ వారి ప్రగతిని అంచనా వేయాలన్నారు. ఆమె వెంట ప్రిన్సిపల్ భూక్య బాలోజీ, అధ్యాపకులు, సిబ్బంది ఉన్నారు.

## విద్యార్థులకు విద్య అభ్యసనపై
## ఉపాధ్యాయులకు సమావేశం



**భిక్కనూరు నవంబర్ 02 (జనంసాక్షి)**
భిక్కనూరు మండలంలోని పెద్దమల్లారెడ్డి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మండల విద్యాధికారి ఆర్. రాజగంగారెడ్డి పాల్గొని వారు మాట్లాడుతూ విద్యార్థుల అభ్యసన సామర్థ్యంపై సంఖ్య పరిజ్ఞానం,మధ్యంతర పరీక్షలు,ప్రథమ సమ్మేటివ్ పరీక్షలు, విద్యార్థుల్లో కనీస అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఉపాధ్యాయులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈసందర్భంగా ప్రధానోపాధ్యాయు రాలు ప్రసున దేవి, స్వామి, ప్రమోద్, ఈశ్వర్ సత్యనారాయణ మహేందర్ ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.




## గ్రామీణ ప్రజలకు చేరువగా ఉచిత న్యాయ సేవలు

**సంచార లోక్ అదాలత్ మొబైల్ వాహనాన్ని ప్రారంభించిన జిల్లా జడ్జి**

**కరీంనగర్ లీగల్, నవంబర్ 02 (జనంసాక్షి)**

గ్రామీణ ప్రాంతాల ప్రజలకు న్యాయ సేవలను మరింత చేరువ చేసేందుకు సంచార లోక్ అదాలత్, ఉచిత న్యాయ సేవల మొబైల్ వాహనాన్ని జిల్లా జడ్జి ఎస్. శివకుమార్ సోమవారం జిల్లా కోర్టు ప్రాంగణంలో ప్రారంభించారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అందించిన ఈ వాహనం ఉమ్మడి కరీంనగర్ జిల్లాతో పాటు సిద్దిపేట జిల్లాలో పర్యటించనుంది. ప్రతి నెల ఆయా ప్రాంతాల్లో పర్యటిస్తూ ఉచిత న్యాయ సహాయంపై అవగాహన కల్పించడంతో పాటు లోక్ అదాలత్‌ల ద్వారా కేసుల పరిష్కారానికి కృషి చేయనున్నారు. ఆధునిక సాంకేతిక సదుపాయాలతో కూడిన ఈ వాహనంలో వీడియో ప్రదర్శనల ద్వారా న్యాయ సేవలపై ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి యశ్వంత్ సింగ్ తెలిపారు. కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా జడ్జి వెంకటేష్, ఇతర న్యాయమూర్తులు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్ పాల్గొన్నారు.

## వర్గీకరణతో అన్యాయం జరిగిందంటూ

## ప్రజావాణిలో మాల మహానాడు కమిటీ వినతి పత్రం

**మల్యాల నవంబర్ 2 (జనం సాక్షి)**



2025 ఏప్రిల్ 14న కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన ఎస్సీ వర్గీకరణ చట్టంలో మాలలకు అన్యాయం జరిగిందని 26 మాల కులా లకు 2 శాతం రిజర్వేషన్ పెంచి 5వ 12వ రోస్టర్ పాయింట్లు కేటాయించాలని కోరుతూ మల్యాల మండల మాల మహానాడు కమిటీ సోమవారం మల్యాల మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో వినతిపత్రం సమర్పించారు. వర్గీకరణతో 20 రోస్టర్ పాయింట్లలో మాలలకు 1 లేకుండా పోయిందని, విద్య, ఉద్యోగాలు, ప్రమోషన్లు కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

## ప్రాథమిక పాఠశాల అభివృద్ధి పనులను పర్యవేక్షించిన డీఈఓ రాము

**మల్యాల నవంబర్ 2 (జనం సాక్షి)**

మల్యాల మండలం తక్కళ్లపల్లి ప్రాథమిక పాఠశాలఅభివృద్ధిలో భాగంగా చేపట్టిన వివిధ పునర్నిర్మాణ పనులను సోమవారం డీఈవో రాము పర్యవేక్షించారు.పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించే లక్ష్యంతో 75 వసంతాల బడి పిలుస్తుందనే కార్యక్రమంలో భాగంగా పాఠశాల పునర్నిర్మాణంలో పూర్వవిద్యార్థులు,గ్రామ ప్రజలు, విద్యాభిమానులు,సుమారు 60 లక్షల రూ చేపడుతున్న సరస్వతీ దేవి విగ్రహ ప్రతిష్ఠాపన, వేదికనిర్మాణం,కిచెన్ షెడ్ నిర్మాణం,ప్రధానోపాధ్యాయుల గది నిర్మాణం, అదనపు తరగతి గది నిర్మాణం,బోరు వేల్ ఏర్పాటు, చెట్ల పెంపకం,తరగతి రూములో మౌలిక వసతులు తదితర అభివృద్ధి పనులు చేపట్టారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు మెరుగైన వసతులు కల్పించడం ద్వారా విద్యా ప్రమాణాలను మెరుగుపరచడానికి అభివృద్ధికి అధికారులు,ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలు సమన్వయంతో కృషి చేయడం అభినందనీయమని తెలిపారు.కార్యక్రమంలో సర్పంచ్ చీకట్లో లత,ఎంఈఓ ఎన్.జయసింహారావు,ప్రధాన ఉపాధ్యాయుడు ఎల్.శంకర్, ఏపీపీసీ చైర్మన్ కోయిల స్వప్న ,వార్డు సభ్యులు దొనకొండ రోజా, ఉపాధ్యాయులు,గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో 3 ఫిర్యాదులు

**మల్యాల నవంబర్ 2 (జనం సాక్షి)**

మల్యాల మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 2 రెవెన్యూ 1 ఇరిగేషన్ కు సంబంధించి మొత్తం 3 ఫిర్యాదులు వచ్చాయని మోడల్ ఆఫీసర్ ఎంపీడీవో స్వాతి తెలిపారు.ఎమ్మార్వో శ్రీనివాస్,ఎంపీఓ ఆమని మరియు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## సాలంపాడ్ సహకార సంఘం చైర్మన్ గా వెంకటేశ్వర్ రెడ్డి ప్రమాణ స్వీకారం

**బోధన్, నవంబర్ 2 ( జనంసాక్షి ) :**

సాలంపాడు సహకార సంఘం చైర్మన్ గా వెంకటేశ్వర్ రెడ్డి సోమవారం పదవి బాధితులు చేపట్టారు. ఈ మేరకు సహకార సంఘం కార్యదర్శి శ్రీనివాస్ ఆయన వచ్చే పది బాధ్యతలు చేపట్టినట్లు సంతకం చేయించారు. ఈ సందర్భంగా చైర్మన్ వెంకటేశ్వర రెడ్డి మాట్లాడుతూ, సహకార సంఘం పరిధిలోని రైతుల అభివృద్ధి కోసం నిరంతర కృషి చేస్తానన్నారు. భోజనం ఎమ్మెల్యే ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి తనపై నమ్మకంతో ఇచ్చిన ఈ పదవిని వమ్ము చేయకుండా రైతుల కోసం పాటుపడతానని చైర్మన్ వెంకటేశ్వర రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం కార్యదర్శి శ్రీనివాస్, మాజీ సహకార సంఘం కార్యదర్శి బసవంతరావు పటేల్, రైతులు పాల్గొన్నారు.

## పోగొట్టుకున్న సెల్ ఫోన్ అందజేత

**కరీంనగర్, క్రైమ్ నవంబర్ 02 ( జనంసాక్షి ) :**



ఖమ్మం కు చెందిన బాంద్ర మనోహర్ అనునతడు ఇటీవల కరీంనగర్ రూరల్ మండలం బొమ్మకల్ లో తన యొక్క పోకో సెల్ ఫోన్ పోగొట్టుకొనగా కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినాడు పోలీసులు సి.ఈ.ఐ.ఆర్ టెక్నాలజీ సహాయంతో పోగొట్టుకున్న సెల్ ఫోన్ ను ట్రేస్ చేసి మంథని లో పట్టుకోవడం జరిగింది.అట్టి ఫోను యజమాని అయిన బాంద్ర మనోహర్ కు ఇన్స్పెక్టర్ ఏ.నిరంజన్ రెడ్డి సెల్ ఫోను ను అందజేశారు సెల్ ఫోన్ ను ట్రేస్ చేయడంలో కృషి చేసిన టెక్ టీం కానిస్టేబుల్ చిట్యాల రాంసాయి మరియు బానోత్ రెనా లను సిఐ ఏ. నిరంజన్ రెడ్డి అభినందించారు.

## యశ్వాడలో ఆయిల్ పామ్ తోటలో క్షేత్ర స్థాయి ప్రదర్శన

**గన్నేరువరం, నవంబర్ 2 (జనంసాక్షి):**

గన్నేరువరం మండలంలోని యశ్వాడ గ్రామ సర్పంచ్ కటకం తిరుపతి ఆయిల్ పామ్ తోటలో ఆయిల్ పామ్ సాగుపై అవగాహన కార్యక్రమం, క్షేత్ర స్థాయి ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ తిరుపతి తన తోటలో ఏర్పాటు చేసిన వర్మీ కంపోస్ట్ యూనిట్, నేల ఆరోగ్య పరిరక్షణ కోసం కలుపు గడ్డిని భూమిలో కలియదున్ని ఎరువుగా మార్చే విధానాన్ని వివరించారు.అనంతరం అధికారులు మాట్లాడుతూ.. ఆయిల్ పామ్ సాగు వల్ల కలిగే ప్రయోజనాలు, ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు, దిగుబడి, దీర్ఘకాలిక ఆదాయ అవకాశాల గురించి రైతులకు వివరించారు. ప్రస్తుతం ఆయిల్ పామ్ గెలల ధర టన్నుకు రూ.22,658 గా ఉందని, గన్నేరువరం మండలంలో సుమారు 280 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు జరుగుతోందని తెలిపారు. రైతులు ఆయిల్ పామ్ సాగు చేపట్టి అధిక ఆదాయం పొందాలని, సాగు విస్తీర్ణాన్ని మరింత పెంచాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఏఓ కిరణ్మయి, ఫీల్డ్ ఆఫీసర్ యేసుమణి, ఏఈఓలు వంశీకృష్ణ, వంశీధర్, అంజలి రైతులు పాల్గొన్నారు.





## నాలుగు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

**రైతులు ప్రభుత్వ మద్దతు ధరను సద్వినియోగం చేసుకోవాలి:**

**పీఏసీఎస్ చైర్మన్ వెంకటరమణారెడ్డి**

**ఇల్లంతకుంట, నవంబర్ 2 (జనంసాక్షి):**

ఇల్లంతకుంట మండలంలోని రేపాక, సోమరంపేట, జంగంరెడ్డిపల్లి, ముస్కాన్‌పేట గ్రామాల్లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పీఏసీఎస్ చైర్మన్ వెంకటరమణారెడ్డి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తాము పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియను సజావుగా నిర్వహించాలని నిర్వాహకులకు ఆదేశించారు. రైతుల కష్టానికి తగిన గౌరవం, పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ యాస తిరుపతి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు, ముస్కాన్‌పేట సర్పంచ్ కోమటిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఇల్లంతకుంట సర్పంచుల ఫోరం అధ్యక్షుడు మామిడి రాజు, జంగంరెడ్డిపల్లి సర్పంచ్ పండుగ సునీత, సోమరంపేట సర్పంచ్ కేతిరెడ్డి భారతవ్వ-లక్ష్మారెడ్డి, రేపాక సర్పంచ్ కాత మల్లేశం, సంఘం డైరెక్టర్లు సింగిరెడ్డి లక్ష్మి, ఏలేటి మాధవరెడ్డి, ఎలుక అనిల్ కుమార్, ఒగ్గు రమేష్, సొల్లు కవిత, ముకిస ఎల్లారెడ్డి, గ్రామ ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, గ్రామ శాఖ అధ్యక్షులు, సహకార సంఘ సభ్యులు, రైతులు, గ్రామ ప్రజలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రజావాణికి ఆరు ఫిర్యాదులు

## విద్యుత్ శాఖకు అత్యధికంగా నాలుగు ఫిర్యాదులు

**గంభీరావుపేట, నవంబర్ 2 జనం సాక్షి**

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఆరు ఫిర్యాదులు అందినట్లు తహసీల్దార్ మారుతి రెడ్డి తెలిపారు. వీటిలో హౌసింగ్ శాఖకు ఒకటి, ఆర్ అండ్ బీ శాఖకు ఒకటి, ఎన్పీడీసీఎల్ విద్యుత్ శాఖకు నాలుగు ఫిర్యాదులు వచ్చినట్లు పేర్కొన్నారు.ఈ సందర్భంగా కోలమద్ది గ్రామ సర్పంచ్ ఏడబోయిన దిలీప్ ఎగువ మానేరు ప్రాజెక్టు కింద ఉన్న ఆర్ అండ్ బీ రోడ్డు ప్రమాదకరంగా మారిందని ఫిర్యాదు చేశారు. ఈ రహదారిపై వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని, అధికారులు స్పందించి రోడ్డుపై మట్టి పోయించి ప్రయాణానికి అనువుగా మార్చాలని కోరారు.తహసీల్దార్ మారుతి రెడ్డి మాట్లాడుతూ ప్రజల నుంచి అందిన ఫిర్యాదులను వచ్చే ప్రజావాణి నాటికి పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. నేటి కార్యక్రమానికి మొత్తం 17 మంది అధికారులు హాజరైనట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏఈఓ సలావుద్దీన్, విద్యుత్ శాఖ ఏఈ ఆనంద్, మండల విద్యాధికారి గంగారాం, సోషల్ వెల్ఫేర్ అధికారి భూదేవి, ఇరిగేషన్ ఏఈ శ్రీకాంత్, ఎంపీఓతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## శ్రీ వినాయక భవన నిర్మాణ కార్మిక సంఘం ఉపాధ్యక్షులుగా న్యాతరి దేవేందర్ ఏకగ్రీవంగా ఎన్నిక

**సుల్తానాబాద్,నవంబర్ 02(జనంసాక్షి) :**



ఆదివారం శ్రీ వినాయక భవన నిర్మాణ కార్మిక సంఘంలో జరిగిన ఎన్నికల్లో సుల్తానాబాద్ సుభాష్ నగర్కు చెందిన న్యాతరి దేవేందర్ ఉపాధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగాన్యాతరి దేవేందర్ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. ప్రభుత్వం నుండి అందే ప్రతి సంక్షేమ కార్యక్రమాలలో నిర్మాణ కార్మికులకు సమచిత స్థానం ఉండేవిధంగా కృషి చేస్తానన్నారు. కాగా న్యాతరి దేవేందర్ నియామకం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## శ్రీ వినాయక భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షున్ని సన్మానించిన ఓగుల రాజేందర్



**సుల్తానాబాద్,నవంబర్ 02(జనంసాక్షి) :**

ఆదివారం జరిగిన శ్రీ వినాయక భవన నిర్మాణ కార్మిక సంఘం ఎన్నికల్లో అధ్యక్షునిగా నియామకం అయిన సుద్దాల గ్రామానికి చెందిన ఆవునూరి రమేష్ ను,కాట్నపల్లి గ్రామానికి చెందిన ఓగుల రాజేందర్ శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఓగుల రాజేందర్ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేయాలని, వారి సమస్యలను పరిష్కారం చేయాలని ఓగుల రాజేందర్ సూచించారు.భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం తన వంతు సహకారం ఇప్పటికి ఉంటుందని కాట్నపల్లి గ్రామానికి చెందిన ఓగుల రాజేందర్ స్పష్టం చేశారు.

## స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేసిన కౌన్సిలర్ వర ప్రదీప్


**సుల్తానాబాద్,నవంబర్ 02(జనంసాక్షి) :**

పెద్దపల్లి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావ్ ఆదేశాల మేరకు,యాదవ నగర్ అంగన్వాడీ పాఠశాలలో 7వ వార్డు కౌన్సిలర్ ఉట్ల వర ప్రదీప్ ఆధ్వర్యంలో స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేయడంతో పాటు, ప్రభుత్వం అందిస్తున్న ఉచిత బియ్యం, నిత్యావసర సరుకులు వివిధ సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు కలుగుతున్న ప్రయోజనాలను వివరించారు.ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు విజయ్,చిరంజీవి,సంతోష్,వెంకటేష్,రత్నం,సరక్క,జి పి ఓ మహేందర్ రెడ్డి,అంగన్వాడీ టీచర్,7వ వార్డు ప్రజలు లబ్ధిదారులు పాల్గొన్నారు.ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందించడమే లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తామని కౌన్సిలర్ ఉట్ల వర ప్రదీప్ తెలిపారు.



## చేపల వేటలో ప్రమాదం.. మత్స్యకారుడి మృతి

**గన్నేరువరం, నవంబర్ 2 (జనంసాక్షి):**



గన్నేరువరం మండల కేంద్రానికి చెందిన రంగనవేణి మల్లయ్య (75) చేపల వేటలో ప్రమాదవశాత్తు మృతి చెందాడు. మత్స్య కార్మికుడైన మల్లయ్య సోమవారం సాయంత్రం చేపల వేట కోసం మానేరు డ్యామ్ వద్దకు వెళ్లాడు. చేపలు పడుతుండగా ప్రమాదవశాత్తు కాలికి చేపల వల చుట్టుకొని నీటిలో పడి మృతి చెందాడు. సమాచారం అందుకున్న గన్నేరువరం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. మృతునికి భార్య లచ్చవ్వ, ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుర్లు ఉన్నారు.



## గట్టెపల్లి శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయ పునర్నిర్మాణానికి రూ.20,000 విరాళం అందించిన అల్లం భాగ్యలక్ష్మి -సత్యనారాయణ దంపతులు

**సుల్తానాబాద్,నవంబర్ 02(జనంసాక్షి) :**

మండలంలోని గట్టెపల్లి గ్రామంలో గల, శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయ పునర్నిర్మాణ కార్యక్రమానికి తమ వంతు సహకారంగా సుల్తానాబాద్ పట్టణం గాంధీనగర్కు చెందిన శ్రీ అల్లం భాగ్యలక్ష్మి సత్యనారాయణ దంపతులు రూ.20,000 (ఇరవై వేల రూపాయలు) విరాళంగా అందించి తమ భక్తి, దాతృత్వ హృదయాన్ని చాటుకున్నారు.దేవాలయ పునర్నిర్మాణం గురించి వారి నివాసంలో కలిసి వివరించగా,ఆలయ నిర్మాణం యొక్క ప్రాముఖ్యతను గుర్తించి,ఎలాంటి ఆలస్యం చేయకుండా వెంటనే స్పందించి రూ.20,000 విరాళం అందించడం ఎంతో అభినందనీయమన్నారు.ఈ పరిచయానికి, సహకారానికి యువ సంకల్ప ఫౌండేషన్ వ్యవస్థాపకులు తుమ్మరాజ్ కుమార్ ముఖ్యపాత్ర పోషించి, అల్లం సత్యనారాయణ ని కలిసే అవకాశం కల్పించడం మంచి పరిణామం అన్నారు.ఈ కార్యక్రమంలో కొల్లూరి సంతోష్ కుమార్, కరెంగుల హరీష్, కరెంగుల అజయ్, కోడి సాయి కుమార్ పాల్గొన్నారు.దైవ కార్యానికి దాతృత్వంతో ముందుకొచ్చిన అల్లం భాగ్యలక్ష్మి -సత్యనారాయణ దంపతులకు హృదయపూర్వక ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.వారి కుటుంబంపై శ్రీ అభయాంజనేయ స్వామి వారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని,ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు,అష్టైశ్వర్యాలు ప్రసాదించాలని మనస్ఫూర్తిగా కోరుకున్నారు.

## స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేసిన కౌన్సిలర్ గాజుల రాజమల్లు



సుల్తానాబాద్,నవంబర్ 02(జనంసాక్షి) : పెద్దపల్లి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావు ఆదేశాల మేరకు, సోమవారం సుల్తానాబాద్,2వ వార్డు లో వార్డు కౌన్సిలర్ గాజుల రాజమల్లయ్య ఆధ్వర్యంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చేశారు.ఈ సందర్భంగా అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేయడంతో పాటు,ప్రభుత్వం అందిస్తున్న ఉచిత బియ్యం,నిత్యావసర సరుకులు వివిధ సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు కలుగుతున్న ప్రయోజనాలను వివరించారు.ఈ కార్యక్రమంలో 12 వార్డు కౌన్సిలర్ గదాసు మంజుల రవి, 15 వార్డు కౌన్సిలర్ అమిరిషెట్టి శ్రావణి రాకేష్,యువ నాయకులు గాజుల హరీష్,కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.



## డిల్లీ నిరసనలో పాల్గొన్న కేకే మహేందర్ రెడ్డి

## రాహుల్ గాంధీ పిలుపు

**ముస్తాబాద్ నవంబర్ 02 (జనం సాక్షి)**

సిరిసిల్ల నియోజకవర్గ ఇంచార్జ్ కేకే మహేందర్ రెడ్డి ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో డిల్లీ రాంలీలా మైదానంలో జరిగిన నిరసన కార్యక్రమంలో సిరిసిల్ల ముఖ్య నేతలతో కలసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్ ప్రక్రియ పేరిట బీజేపీ లక్షలాది ఓట్లను తొలగిస్తుందని తమ నేత రాహుల్ గాంధీ పిలుపు మేరకు తెలంగాణ రాష్ట్రం పక్షాన వారితో పాటు నిరసన కార్యక్రమంలో పాల్గొని ఓట్ చోరీ పట్ల కాంగ్రెస్ పార్టీ చేస్తున్న డిమాండ్లను అంగీకరించే వరకు ప్రజాస్వామ్య బద్దంగా కేంద్ర ప్రభుత్వ వైఖరి పై పోరాడుతామని అన్నారు. వారి వెంట సిరిసిల్ల ముఖ్య నాయకులు,కార్యకర్తలు,తదితరులు ఉన్నారు.

## పేకాట ఆడుతున్న ఆరుగురు అరెస్ట్

## నగదు, సెల్ఫోన్లు స్వాధీనం



**కరీంనగర్ క్రైమ్, నవంబర్ 02 (జనంసాక్షి) :**

కరీంనగర్ టాస్క్‌ఫోర్స్ ఏసీపీ సతీష్ ఆధ్వర్యంలో పోలీసులు రామచంద్రపురం కాలనీలో పేకాట స్థావరంపై దాడి చేసి ఆరుగురిని పట్టుకున్నారు. వారి వద్ద నుంచి ఆరు సెల్‌ఫోన్లు, రూ. 32,340 నగదును స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిని తదుపరి చర్యల నిమిత్తం వన్‌టౌన్ పోలీసులకు అప్పగించారు. ఈ దాడిలో ఆర్ఎస్ఐ శ్రీకాంత్, హెడ్ కానిస్టేబుళ్లు శ్రీనివాస్, సురేంద్ర, పాల్‌సింగ్, మల్లేష్, కానిస్టేబుళ్లు సాయిదీప్, విశ్వతేజ, సాయి నేత్ర పాల్గొన్నారు.

## శ్రీ వినాయక భవన నిర్మాణ కార్మిక సంఘం ఉపాధ్యక్షులుగా క్యాదాషి రమేష్

### - కార్యవర్గ సభ్యులుగా రంగయ్య

**సుల్తానాబాద్,నవంబర్ 02(జనంసాక్షి) :**

ఆదివారం శ్రీ వినాయక భవన నిర్మాణ కార్మిక సంఘం ఎన్నికల్లో, మండలంలోని తొగర్రాయి గ్రామానికి చెందిన క్యాదాషి రమేష్ ఉపాధ్యక్షులుగా ఎన్నికయ్యారు.కార్యవర్గ సభ్యులుగా పూసాల గ్రామానికి చెందిన కల్వల రంగయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికుల సమస్యలపై నిరంతరం కృషి చేస్తామన్నారు.





# విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

## - మండల ప్రత్యేక అధికారి బండి రాజేశ్వరి

**రామడుగు(జనంసాక్షి):**



విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన భోజనం అందించడం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని మండల ప్రత్యేక అధికారి బండి రాజేశ్వరి సూచించారు. సోమవారం మండల పరిషత్ అభివృద్ధి అధికారి సంగి రాజేశ్వరి, మండల విద్యాధికారి రంగనాథ్ శర్మతో కలిసి రామడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సందర్శించారు.ఈ సందర్భంగా పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనం నాణ్యత, రుచి, పరిశుభ్రత తదితర అంశాలను స్వయంగా పరిశీలించడంతో పాటు, విద్యార్థులతో నేరుగా మాట్లాడి భోజనం నాణ్యతపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పదో తరగతి విద్యార్థిని, విద్యార్థులతో ప్రత్యేకంగా ముఖాముఖి నిర్వహించారు. ముఖ్యంగా వివిధ సంక్షేమ వసతి గృహాల నుంచి వచ్చి పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల బాగోగులను అడిగి తెలుసుకున్నారు. వసతి గృహాల్లో కల్పిస్తున్న సౌకర్యాలు, భోజన వసతి, చదువుకునేందుకు అనుకూలమైన వాతావరణం, ఎదురవుతున్న సమస్యలు తదితర అంశాలపై విద్యార్థులతో మాట్లాడారు. వసతి గృహంలో ఉండటం అనేది చదువుకు ఎలాంటి ఆటంకం కాదని, సరైన లక్ష్యం, క్రమశిక్షణ, నిరంతర కృషి ఉంటే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని పేర్కొన్నారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి సంగి రాజేశ్వరి మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థుల జీవితంలో అత్యంత కీలకమైన దశ అని, ఈ సమయంలో సమయాన్ని వృథా చేయకుండా ప్రణాళికాబద్ధంగా చదవాలని సూచించారు. అధికారులు అడిగిన ప్రశ్నలకు విద్యార్థులు ఉత్సాహంగా సమాధానాలు ఇచ్చారు.

# సంరక్షణ అవసరమైన చిన్నారుల భద్రత, ఆరోగ్యం, సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలి

## కలెక్టర్ కోయ శ్రీ హర్ష

జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ప్రారంభించారు. ఈ సందర్భంగా శిశుగృహలో కల్పించిన సౌకర్యాలను పరిశీలించి,చిన్నారులకు అందించే సంరక్షణ, వసతుల వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ,తల్లిదండ్రుల సంరక్షణకు నోచుకోని, వదిలివేయబడిన,అనాథ,సంరక్షణ అవసరమైన పసిపిల్లలకు సురక్షితమైన ఆశ్రయం కల్పించడమే శిశుగృహ ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు.జననం నుంచి ఆరు సంవత్సరాల లోపు వయస్సు గల చిన్నారులకు ప్రేమపూర్వక సంరక్షణ, పోషకాహారం, వైద్య సదుపాయాలు, ఆరోగ్య పరిరక్షణతో పాటు వయస్సుకు తగిన అభివృద్ధి అవకాశాలను ఈ కేంద్రం ద్వారా అందించనున్నట్లు తెలిపారు.చిన్నారుల భద్రత, ఆరోగ్య పరిరక్షణ విషయంలో నిర్లక్ష్యం వహించకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. పిల్లలకు ఆహ్లాదకరమైన, సురక్షితమైన వాతావరణం కల్పించడంతో పాటు, వారి అవసరాలకు అనుగుణంగా మెరుగైన సదుపాయాలు అందుబాటులో ఉంచాలని అధికారులకు తెలిపారు.– చట్టబద్ధమైన దత్తత ప్రక్రియ ద్వారా కుటుంబ వాతావరణం : శిశుగృహలో సంరక్షణ పొందుతున్న అర్హులైన చిన్నారులకు చట్టబద్ధమైన దత్తత ప్రక్రియ ద్వారా కుటుంబ వాతావరణాన్ని కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవడం కూడా ఈ కేంద్రం లక్ష్యాలలో భాగమని అధికారులు తెలిపారు. చిన్నారుల భవిష్యత్తుకు భరోసా కల్పించేలా నిబంధనల ప్రకారం అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.ఈ కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు, మున్సిపల్ కమిషనర్ రమేష్, సీడీపీఓ అనిత, సీనియర్ అసిస్టెంట్ సత్యనారాయణ, జిల్లా బాలల సంరక్షణ అధికారి జితేందర్, బాలసదన్ సిబ్బంది పాల్గొన్నారు.

# బండలింగంపల్లి గ్రామంలోని ఒకరిని దాడిచేసి హత్యాయత్నం చేయడానికి ప్రయత్నించిన వ్యక్తి అరెస్ట్- రిమాండ్‌కు తరలింపు



**ఎల్లారెడ్డిపేట, నవంబర్ 02, (జనంసాక్షి) :** ఎల్లారెడ్డిపేట మండలంలోని బండలింగం పల్లి గ్రామానికి చెందిన బోడ్డు రాజు అను అతడు టెంట్ హౌస్, వ్యవసాయం చేసుకొని జీవిస్తాడని, అతనితోపాటు టెంటె హౌస్‌లో పని చేసే అదే గ్రామానికి చెందిన బొడ్డు నరేష్, జక్కుల మహేష్ అను వారు బండలింగంపల్లి గ్రామంలో హల్దీ ఫంక్షన్ ఉండగా టెంటు వేసి తిరిగి ఇంటికి వస్తుండగా టాటా ఏసి ఆటోలో డిజిల్ అయిపోయిందని డీజిల్ కోసం వారి ముగ్గురు అందాజ రాత్రి ఆదివారం రోజున 11:30 గంటలకు కాసరవేణి ఎల్లం ఇంటికి డిజిల్ గురించి రాగా అక్కడ ఒక కొత్త వ్యక్తి నిల్చుని ఉండగా అతడు మీరెందుకు అతనిని లేపుతున్నారని అడుగగా, అట్టి వ్యక్తి నీవు ఎవరని అడుగగా అతడు మహేష్, నరేష్‌లను బూతులు తిడుతూ గొడవ పడగా నూకేసుకుంటుండగా బొడ్డు రాజు అట్టి గొడవను ఆపేందుకు మధ్యలోకి వెళ్లగా అడగడానికి మీరెవరు అంటూ అట్టి కొత్త వ్యక్తి ఇంటిలో నుండి కూరగాయలు కోసే కత్తి తీసుకుని వచ్చి మీ అందరిని చంపుతానని కత్తితో బొడ్డు రాజు కడుపులో కుడివైపున పొడువగా రక్త గాయం అవ్వగా అక్కడున్నవారు ఎల్లారెడ్డిపేటలో అశ్విని ఆసుపత్రికి చికిత్స గురించి తీసుకెళ్లారు. బొడ్డు రాజును అజ్మీర శ్రీను (25సం॥), మెదక్ జిల్లాలోని శంకరంపేట మండలంలోని మీర్జపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి పెయింటింగ్ పని గురించి బండలింగంపల్లి గ్రామంలోని గరిపేల్లి సంతోష్ ఇంటికి వచ్చాడని, బొడ్డు రాజును చంపాలని ఉద్దేశంతో కత్తితో పొడిచిని అజ్మీర శ్రీనుపై చర్యలు తీసుకోవాలని బొడ్డు రాజు తండ్రి బొడ్డు బాలనర్సు ఇచ్చిన దరఖాస్తుపై ఎల్లారెడ్డిపేట ఎస్ఐ రమేష్ కేసు నమోదు చేసి కేసు దర్యాప్తులో భాగంగా సోమవారం రోజున అజ్మీర శ్రీనును అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించడం జరిగిందని ఎల్లారెడ్డిపేట సిఐ ఓ. వెంకటేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఎల్లారెడ్డిపేట సిఐ ఓ. వెంకటేష్ మాట్లాడుతూ ప్రజలు చిన్న చిన్న విషయాలకు ఆవేశపడకుండా, గొడవలు, దాడులకు దూరంగా ఉండాలని, ఎవరైన చట్టవిరుద్ధ చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోబడతాయని, సమస్యలు తలెత్తినప్పుడు చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకుండా పోలీసులను ఆశ్రయించాలని సిఐ కోరారు.

# కత్తిపోట్లకు గురైన బండలింగంపల్లి ఉపసర్పంచ్



**ఎల్లారెడ్డిపేట, నవంబర్ 02, (జనంసాక్షి) :** ఎల్లారెడ్డిపేట మండలంలోని బండలింగంపల్లి గ్రామ ఉపసర్పంచ్ బొడ్డు రాజు కత్తిపోట్లకు గురయ్యారు. గ్రామంలో పెయింటర్‌గా పనిచేస్తున్న మెదక్ జిల్లా మీర్జాపేటకు చెందిన అజ్మీర శ్రీనివాస్ ఆదివారం రాత్రి సుమారు 11 గంటల సమయంలో ఉపసర్పంచ్ రాజుపై కత్తితో దాడి చేసినట్లు తెలిసింది. గ్రామంలో శ్రీనివాస్‌కు మరికొందరు వ్యక్తులకు మధ్య గొడవ జరుగగా, వారు పరస్పరం దాడి చేసుకునే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో అక్కడికి చేరుకున్న ఉపసర్పంచ్ బొడ్డు రాజు ఇరువర్గాలకు సర్దిచెప్పి గొడవను ఆపేందుకు ప్రయత్నించారు. అయితే ఆగ్రహానికి గురైన శ్రీనివాస్ ఉపసర్పంచ్ రాజును కత్తితో పొడిచినట్లు సమాచారం. దీంతో గాయపడిన ఉపసర్పంచ్‌ను స్థానికులు వెంటనే ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఉపసర్పంచ్ రాజు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. సంఘటనపై సమాచారం అందుకున్న ఎల్లారెడ్డిపేట పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు. అసలు గొడవకు కారణాలేమిటి, ఉపసర్పంచ్‌పై దాడికి దారితీసిన పరిస్థితులేమిటి, అనే విషయాలు తెలియాల్సి ఉంది. పోలీసుల విచారణ ఆనంతరం పూర్తి వివరాలు వెల్లడికానున్నాయి.

# హరిదాస్‌నగర్ గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు

**ఎల్లారెడ్డిపేట, నవంబర్ 02, (జనంసాక్షి) :**

ఎల్లారెడ్డిపేట మండలంలోని హరిదాస్‌నగర్ గ్రామంలో గ్రామస్తుల సహకారంతో 8 సీసీ కెమెరాలను పాలకవర్గం, సర్పంచ్ నాగరాజ్‌యాదవ్‌లు ఏర్పాటు చేశారు. ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను సిరిసిల్ల డిఎస్పి నాగేంద్రచారి, ఎల్లారెడ్డిపేట సిఐ వెంకటేష్, ఎస్ఐ రమేష్‌లు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డిఎస్పీ నాగేంద్రచారి మాట్లాడుతూ సిసి కెమెరాలు గ్రామంలో ఏర్పాటు చేసుకోవడం వలన దొంగతనాల నివారనకు, మహిళ భద్రతకు దోహదపడతాయని తెలిపారు. ఇంతమంచి కార్యక్రమాన్ని నిర్వహించిన గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులకు, గ్రామస్తులకు అభినందనలు తెలిపారు. యవకులు ప్రజాప్రతినిధులుగా ఉంటే గ్రామాలు అభివృద్ధి బాటలో నడుస్తాయని తెలిపారు. అనంతరం గ్రామంలో గల వాలీబాల్ ప్లేయర్స్‌కు పాలకవర్గం నుంచి అందించిన జర్సీలను వారికి అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిఐ వెంకటేష్, ఎస్ఐ రమేష్, గ్రామ సర్పంచ్ చిర్రామ్ నాగరాజు యాదవ్, ఉపసర్పంచ్ గుమ్మడి సతీష్, ఏఎంసి చైర్మన్ దేవానందం, ఏఎంసి వైస్ చైర్మన్ నంది కిషన్, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షులు దొమ్మాటి నర్సయ్య, పాలకవర్గం సభ్యులు ఉప్పుల ఎల్లారెడ్డి, పంతంగి సతీష్, అనింగారి మమత, వట్టెల సాత్విక, తెడ్డు అనిత, పంతంగి అశ్విని, మండల కాంగ్రెస్ నాయకులు సద్ది లక్ష్మారెడ్డి, షేక్ గౌస్, గుండాటి రామ్‌రెడ్డి, గుర్రాల రాజిరెడ్డి, వంగ శ్రీకాంత్‌రెడ్డి, బండారి బాల్‌రెడ్డి, గ్రామస్తులు, పాత్రికేయులు తదితరులు పాల్గొన్నారు.



# అక్రమంగా నిల్వ ఉంచిన 6 క్వింటాళ్ల పీడీఎస్ సన్నబియ్యం పట్టివేత శ్రీనాథ్

## - జిల్లా పౌరసరఫరాల అధికారి

**పెద్దపల్లి,నవంబర్ 02(జనంసాక్షి) :**

అక్రమంగా నిల్వ ఉంచిన 6 క్వింటాళ్ల పీడీఎస్ సన్నబియ్యం పట్టుకున్నట్లు జిల్లా పౌరసరఫరాల అధికారి శ్రీనాథ్ తెలిపారు.జిల్లా పౌరసరఫరాల అధికారి కె. శ్రీనాథ్ ఆధ్వర్యంలో సోమవారం పౌరసరఫరాల శాఖ అధికారులు పెద్దపల్లి పట్టణంలోని సాగర్ రోడ్‌లో గల ఇంటి నంబర్ 3-3-136/ఏ/1లో తనిఖీలు నిర్వహించారు.ఈ తనిఖీల్లో ప్రజాపంపిణీ వ్యవస్థ (పి టి ఎస్) ద్వారా సరఫరా చేసే సన్నబియ్యాన్ని ప్యాకేజీ బ్యాగుల్లో నింపుతున్న బజ్జూరి శంకర్, తండ్రి రాములును అధికారులు పట్టుకున్నారు.ఈ సందర్భంగా 23 బ్యాగుల్లో ఉన్న మొత్తం 6 క్వింటాళ్ల పీడీఎస్ సన్నబియ్యాన్ని స్వాధీనం చేసుకుని, భద్రత నిమిత్తం ఎంఎల్ఎస్ పాయింట్‌కు అప్పగించారు.పీడీఎస్ సన్నబియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి అధిక ధరకు విక్రయిస్తున్నట్లు గుర్తించిన అధికారులు బజ్జూరి శంకర్‌పై 6- కేసుతో పాటు క్రిమినల్ కేసు నమోదు చేశారు.ఈ తనిఖీల్లో పోచయ్య (డిటిసిఎస్), రాజిరెడ్డి (సి.ఎస్.ఐ),శ్రీనివాస్ (ఈటిఎఫ్ కానిస్టేబుల్) పాల్గొన్నారు.

# భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులకు దుస్తులు, ఇతర సామగ్రి కొనుగోలుకు దరఖాస్తుల ఆహ్వానం

## - జిల్లా విద్యాశాఖ అధికారి జి. శారదలి

**పెద్దపల్లి,నవంబర్ 02(జనంసాక్షి) :**



జాయింట్ స్టేట్ సెక్రటరీ, భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ తెలంగాణ రాష్ట్ర అసోసియేషన్, హైదరాబాద్ ఆదేశాల మేరకు 2026-2027 సంవత్సరానికిగాను పెద్దపల్లి జిల్లాలోని (47) ప్రభుత్వ పాఠశాలల లోని భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులకు దుస్తులు, ఇతర సామగ్రి కొనుగోలుకై దరఖాస్తులను ఆహ్వానించడమైనదని లిజిల్లా విద్యాశాఖ అధికారి జి. శారదలి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఆసక్తి కలవారు తమ యొక్క దరఖాస్తులను జిల్లా విద్యాశాఖ కార్యాలయము, నందు నవంబర్ 06లోగా సమర్పించాలని, మరిన్ని వివరాల కోసం 9849878622 ఫోన్ నెంబర్ ద్వారా సంప్రదించాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.